ముచ్చటగా ముగ్గురు..!

- నందికొట్కూరులో అగ్నిమాపక కేంద్రం భవన నిర్మాణానికి భూమిపూజ
- వేర్వేరుగా పాల్గొన్న ఎంపీ, ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్మన్
- మరోమారు తేటతెల్లమైన విభేదాలు



భూమిపూజ చేస్తున్న మున్సిపల్ చైర్మన్



భూమిపూజ చేస్తున్న ఎంపీ శబరి



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే జయసూర్య

నందికొట్కూరు, మే 10 (ఆంధ్రజ్యోతి) : నందికొట్కూరు నియోజకవర్గంలో రాజకీయ విభేదాలు తారాస్థాయికి చేరాయి. ఇటీవల మున్సిపల్ చైర్మన్ అవిశ్వాస అంశంలో ఎంపీ బైరెడ్డి శబరి, ఎమ్మెల్యే గిత్తా జయసూర్య వర్గపోరు బహిర్గతమైన విషయం తెలిసిందే. మళ్లీ ఇప్పుడు తాజాగా నందికొట్కూరులో ఓ భవన నిర్మాణానికి సంబంధించి భూమిపూజ విషయంలో అలాంటి సంఘటనే ఒకటి చోటుచేసుకుంది. శనివారం పట్టణంలోని బైరెడ్డి నగర్‌లో నియోజకవర్గ అగ్నిమాపక కేంద్ర నూతన భవన నిర్మాణం కోసం శంకుస్థాపన కార్యక్రమం జరిగింది. అయితే ఈ కార్యక్రమానికి ఎంపీ బైరెడ్డి శబరి, ఎమ్మెల్యే గిత్తా జయసూర్య, మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి వేర్వేరుగా వేర్వేరు సమయాల్లో భూమిపూజ చేయడం హాట్ టాపిక్‌గా మారింది. ముందుగా ముహూర్తం దాటిపోతుందన్న నెపంతో ఉదయం 9:41 గంటలకు మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి వార్డు కౌన్సిలర్ చాంద్‌బాషతో శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే గిత్తా జయసూర్య 10:17 గంటలకు చేరుకుని మళ్లీ శంకుస్థాపన చేశారు. ఇక ఎంపీ బైరెడ్డి శబరి 11:02 గంటలకు చేరుకుని ముచ్చటగా మూడోసారి శంకుస్థాపన చేశారు. ఇదిలా ఉండగా శంకుస్థాపనల తంతు పూర్తి చేసేందుకు అగ్నిమాపక శాఖ అధికారులు తలలు పట్టుకోవాల్సి వచ్చింది. ఒకే పార్టీ నుంచి గెలిచిన వారు ఇలా వేర్వేరుగా పాల్గొనడం కేడర్‌లో గందరగోళానికి దారి తీసింది.

4,700 ఉపాధ్యాయ బదిలీల ఖాళీలు

- 90శాతం పోస్టులను ఆన్‌లైన్‌లో ఎంట్రీ
- కర్నూలు డీఈవో శామ్యూల్‌పాల్
- ఉమ్మడి జిల్లా విద్యా శాఖాధికారులతో సమావేశం

కర్నూలు ఎడ్యుకేషన్, మే 10 (ఆంధ్రజ్యోతి): కర్నూలు ఉమ్మడి జిల్లాలో 4,700 ఉపాధ్యాయ బదిలీల ఖాళీలు ఉన్నాయని డీఈవో శామ్యూల్‌పాల్ అన్నారు. శనివారం స్థానిక మాంటిస్సోరి పాఠశాలలో ఉమ్మడి జిల్లా విద్యాశాఖ అధికారులతో ఉపాధ్యాయ బదిలీ ఖాళీలపై సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో 4,700 ఉపాధ్యాయ ఖాళీలను ఆన్‌లైన్‌లో అప్‌లోడు చేశామన్నారు. ఇందులో ఎనిమిదేళ్ల సర్వీసు పూర్తయిన ఉపాధ్యాయులు, స్టడీలో ఉన్న ఉపాధ్యాయులు, దీర్ఘకాలికంగా లీవ్‌లో ఉన్నవారందరి పోస్టులను భర్తీచేయనున్నట్లు తెలిపారు. మొదటి రోజు 90శాతం పోస్టులను ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేశామని, మిగిలిన 10శాతాన్ని ఆదివారం పూర్తి చేయనున్నట్లు డీఈవో వివరించారు. రాష్ట్రంలోనే అత్యధిక ఉపాధ్యాయ ఖాళీలు ఉన్న జిల్లా ఉమ్మడి కర్నూలు జిల్లానే అని తెలిపారు. ఇప్పటి వరకు అత్యధికంగా ఎంట్రీ చేసింది కూడా కర్నూలు జిల్లానే అని అన్నారు. ఖాళీలను ఆన్‌లైన్‌లో అప్‌లోడు చేసి, ప్రభుత్వం అనుమతించాక ఉపాధ్యాయ ఖాళీలను ఆన్‌లైన్‌లో ఉంచుతామన్నారు. ప్రభుత్వం ఉపాధ్యాయ బదిలీల గైడెన్స్ ఇచ్చిన తర్వాత ఉపాధ్యాయుల బదిలీలకు ఆప్షన్లు ఇచ్చుకోవాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో నంద్యాల జిల్లా డీఈవో జనార్దన్‌రెడ్డి, డిప్యూటీ డీఈవోలు, మండల విద్యాశాఖ అధికారులు, సూపరింటెండెంట్స్, సిబ్బంది ఉన్నారు.

పాడిరైతుకు ప్రోత్సాహం



పాడిరైతులను రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. వేసవిలో దాణా కొరతతో ఇబ్బందులు పడకుండా ఉండేందుకు చర్యలు చేపట్టింది. తెల్ల రేషన్‌కార్డు కలిగిన పశుపోషకులకు 50 శాతం రాయితీతో 90 రోజులకు దాణాను పంపిణీ చేయనున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. తెల్లరేషన్‌కార్డు కల్గిన పాడిరైతులు రైతుసేవాకేంద్రాల ద్వారా నమోదు చేయించుకొని పశువైద్యశాలల్లో దాణాను తీసుకెళ్లే విధంగా శరవేగంగా దాణాను జిల్లాలకు చేరవేస్తున్నారు. త్వరలోనే దాణా కోసం నమోదు చేసుకున్న రైతులకు పంపిణీ చేయనున్నారు.

-నంద్యాల ఎడ్యుకేషన్, మే 9 (ఆంధ్రజ్యోతి):

- 50శాతం రాయితీతో పశువులకు సమీకృత దాణా
- ప్రతి పశువుల ఆసుపత్రి ద్వారా పంపిణీ
- 90 రోజులకు 450 కేజీల దాణా..

మొదటి విడతగా 250 మెట్రిక్ టన్నులు

ప్రతి జిల్లాకు మొదటివిడతగా నెలకు సరిపడా 250 మెట్రిక్ టన్నులను ప్రభుత్వం కేటాయించింది. జిల్లాకు చేరుకున్న దాణా బస్తాలను పశువుల డిస్పెన్సరీలకు తరలించే బాధ్యతను మార్క్‌ఫెడ్‌కు అప్పగించింది. నంద్యాలలో నిల్వవుంచిన గోదాముల నుంచి ఒక్కో పశువుల ఆసుపత్రికి రెండున్నర టన్నుల నుంచి మూడు టన్నుల వరకు తరలించనున్నారు. నంద్యాల జిల్లాలో 74 పశు డిస్పెన్సరీలు, 15 ఏరియా ఆసుపత్రుల ద్వారా దాణాను 50 శాతం రాయితీతో రైతులకు అందించనున్నారు.

విడతల వారీగా 90 రోజులు పంపిణీ

పశువుల పెంపకందారులకు 20శాతం పోషకాలతో కూడిన దాణాను అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఒక్కో కుటుంబానికి గరిష్టంగా రెండు పెద్ద పశువులు, ఒక దూడకు 90రోజులకు గాను 450కేజీల దాణాను పంపిణీ చేయనున్నారు. రూ.1110 విలువైన 50కేజీల దాణా బస్తాను రైతుకు సబ్సిడీపై రూ.555కు అందించనున్నారు.



పశుగ్రాసం కొరతను అధిగమించేందుకే..



వేసవిలో పశుగ్రాసం కొరతను అధిగమించేందుకు ప్రభుత్వం ఈనిర్ణయం తీసుకుంది. మంచి పోషకాలతో కూడిన దాణాను రైతులకు 50శాతం రాయితీతో అందజేస్తున్నాం. త్వరలోనే రైతులకు పంపిణీ చేస్తాం.

- గోవిందనాయక్, జేడీ, పశుసంవర్ధకశాఖ, నంద్యాల

మూడు రోజుల్లో చేరవేస్తాం



గోదాములకు చేరుకున్న పశువుల దాణాను మూడు రోజుల్లోగా ఒక్కో పశువుల ఆసుపత్రికి రెండున్నర నుంచి మూడు టన్నులను చేర వేస్తాం. ఇప్పటికే 250 మెట్రిక్ టన్నుల పశుదాణా ఉంది. పశుసంవర్ధకశాఖ అధికారులు తయారుచేసిన రూట్‌మ్యాప్, కేటాయింపుల మేరకు దాణా చేరుస్తాం. - హరినాథరెడ్డి, మేనేజర్, మార్క్‌ఫెడ్, నంద్యాల

మళ్లీ మొదటికి..!

- ఆర్‌యూలో టైం స్కేల్ ఉద్యోగుల వివాదం
- 17 మందిని విధుల్లోకి తీసుకునేందుకు ఉత్సాహం
- గతంలో ఫేక్ సర్టిఫికెట్లతో ఉద్యోగాల్లో చేరిక
- విద్యాశాఖ విచారణలో వెల్లడి
- అయినా విధుల్లోకి తీసుకునేందుకు చర్యలు?

కర్నూలు అర్బన్, మే 10(ఆంధ్రజ్యోతి): రాయలసీమ యూనివర్సిటీలో టైం స్కేల్ ఉద్యోగుల వివాదం మళ్లీ మొదటికి వచ్చింది. 2018లో అప్పటి ఉపకులపతి 102 మంది కాంట్రాక్టు ఉద్యోగులను, ఒకే సర్వీసులో 5 సంవత్సరాలు పని చేసిన వారిని టైం స్కేల్ ఉద్యోగులుగా ప్రమోట్ చేశారు. కానీ టైం స్కేల్ ఉద్యోగుల్లో చాలా మంది 60 సంవత్సరాలకు పైబడిన వారు ఉండటం, ఫేక్ సర్టిఫికెట్లతో ఉద్యోగం తెచ్చుకున్నట్లు ఆరోపణలు వచ్చాయి. దీంతో అప్పటి ఉపకులపతి ఇంటర్నల్ కమిటీతో నామమాత్రంగా విచారణ చేసి మమ అనిపించారు. అయితే పూర్తిస్థాయి కమిటీతో విచారణ చేపట్టాలని డిమాండ్లు వ్యక్తమయ్యాయి. దీంతో ఏడేళ్ల నుంచి టైం స్కేల్ ఉద్యోగుల ఫైల్‌పై వివాదాలు అలుముకున్నాయి. ఓ విద్యార్థి నాయకుడి ఫిర్యాదుతో అప్పటి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శ్యామల రావు విచారణకు ఆదేశించారు. 42 మంది టైం స్కేల్ ఉద్యోగుల జాబితాను అప్పటి ఉపకులపతి ఆనందరావు కర్నూలు, నంద్యాల డీఈఓ (జిల్లా విద్యాశాఖాదికారులకు) టైం స్కేల్ ఉద్యోగుల జాబితా పంపారు. అందులో విచారణ అనంతరం 39 మంది ఫేక్ సర్టిఫికెట్‌గా నిర్ధారించారు. వాటిలో కర్నూలు డీఈఓ కార్యాలయం 17 మంది ఫేక్ అని నిర్ధారించి పంపడంతో వారిని అప్పటి వీసీ ఆనందరావు వారిని తొలగించారు. తాజాగా నంద్యాల జిల్లా విద్యాశాఖ అధికారి మరో 22 మంది ఉద్యోగులకు సంబంధించి కూడా నకిలీ సర్టిఫికెట్లు అంటూ జాబితా సిద్ధం చేసి రాయలసీమ యూనివర్సిటితో పాటు ఉన్నత విద్యామండలికి సిఫారసు చేసినట్లు సమాచారం. ఈ క్రమంలో మిగిలిన ఉద్యోగులపై కూడా వేటు పడే అవకాశం ఉందనే ప్రచారం యూనివర్సిటీలో జరుగుతోంది.

- కూటమి ప్రభుత్వం ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కాంట్రాక్టు, టైం స్కేల్ ఉద్యోగుల జాబితాను సీఎఫ్ఎంఎస్‌కు పంపాలని స్టేట్ ఫైనాన్స్ అధికారులు ఆదేశించారు. కానీ రాయలసీమ యూనివర్సిటీలో టైం స్కేల్ ఉద్యోగుల జాబితా మాత్రం తిరస్కరించారు. రూల్ ఆఫ్ రిజర్వేషన్ లేకుండా ఎక్స్‌టర్నల్ కమిటీ ఆమోదం లేకుండా అడ్డగోలుగా ఫేక్ సర్టిఫికెట్స్ పెట్టిన వారి పేర్లను కూడా పంపారు. వాటిని సరి చేసి అర్హత గల వారి టైం స్కేల్ ఉద్యోగుల పేర్లు మాత్రమే పంపాలంటూ రాష్ట్రస్థాయి అధికారులు తిరస్కరించడం చర్చనీయాంశమైంది.
- 102 మంది టైం స్కేల్ ఉద్యోగుల జాబితాను సామాజిక వర్గాల వారీగా పరిశీలిస్తే ఎస్సీ-54, బీసీ-27, ఓసీ-15, ఎస్టీ-6గా ఉన్నాయి. అయితే ఒకే సామాజిక వర్గానికి పెద్ద పీట వేసి కొన్ని సామాజిక వర్గాలకు అన్యాయం చేశారంటూ బీసీ సంఘాల నాయకులు మండిపడుతున్నారు. ఉన్నత విద్యామండలి రాష్ట్ర స్థాయి వర్సిటీల రివ్యూ మీటింగ్‌లో అప్పటి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శ్యామలరావు ఆర్‌యూలో ఉద్యోగులకు సంబంధించి అడ్డగోలు నిర్ణయాల తీరును ప్రస్తావించారు.

ఉపకులపతికి ఎందుకంత ఉత్సాహం



నంద్యాల జిల్లా విద్యాశాఖాధికారి సిఫారసు చేసిన జాబితాను తొక్కిపెట్టి తొలగించిన 17 మంది ఉద్యోగులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని ఉపకులపతి ఉత్సాహం ప్రదర్శించడంపై విద్యార్థి సంఘాలు మండిపడుతున్నాయి. వివాదాస్పద ఉద్యోగులను తీసుకోవడంపై జిల్లాకు చెందిన ఓ ప్రజాప్రతినిధి కీలకంగా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఉద్యోగులను తొలగించిందని వాళ్లను విధుల్లోకి తీసుకోవాలని కీలక ప్రజాప్రతినిధి మంత్రి లోకేశ్ దృష్టికి తీసుకెళ్లాడని ఆర్‌యూలో చర్చసాగుతోంది. వివాదాస్పద ఉద్యోగులను విధుల్లోకి తీసుకోవాలని అదే ప్రజాప్రతినిధి ఉపకులపతిని కూడా కోరినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో ఆ ఉద్యోగులవి ఫేక్ సర్టిఫికెట్లని జిల్లా విద్యాశాఖ నిర్ధారించిన నివేదికలు, పాలక మండలిలో తీసుకున్న నిర్ణయాలను కాదని విధుల్లోకి తీసుకునేందుకు ప్రయత్నించడం ఏమిటని పలువురు ప్రొఫెసర్లు, విద్యార్థి సంఘాల నాయకులు ప్రశ్నిస్తున్నారు. ఇందులో ప్రజాప్రతినిధి బంధువులు ఆరుగురితో పాటు ఆయన సామాజికవర్గం, సొంత గ్రామానికి చెందిన మరో 9 మంది ఉండటంతోనే ఒత్తిడి వేగవంతమైనట్లు స్పష్టంగా తెలుస్తోంది. ఎలాగైనా అతి త్వరలోనే వివాద ఉద్యోగులను విధుల్లోకి తీసుకునేల పావులు కదుపుతున్నట్లు సమాచారం.

అలాంటిదేమీ లేదు

గతంలో తొలగించిన వారిని ఎలా తీసుకుంటాం. అలాంటిదేమీ లేదు. కానీ ఎవరినైనా ఉద్యోగులను విధుల్లోకి తీసుకోవాల్సి వస్తే ఉన్నత విద్యాశాఖ అనుమతులు మేరకే తీసుకుంటాం.

- వి.వెంకట బసవరావు, ఉపకులపతి, రాయలసీమ యూనివర్సిటీ

మిస్టరీ వీడేనా..?

- ఆంధ్రజ్యోతి కథనంతో కదిలిన పోలీస్ యంత్రాంగం
- సీఐ, ఇద్దరు ఎస్ఐలతో క్షేత్రస్థాయిలో పరిశీలన
- 23 ఎముకలు, దంతాలు తదితర వస్తువుల గుర్తింపు
- ఫోరెన్సిక్ ల్యాబ్‌కు తరలింపు
- ఎట్టకేలకు కేసు నమోదు
- విచారణ అధికారిగా డీఎస్పీ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నంద్యాల/గడివేముల, మే 10 (ఆంధ్రజ్యోతి): గడివేముల మండలంలో గుర్తు తెలియని వ్యక్తి మృతికి సంబంధించిన సంఘటనలో పోలీసులు ఎట్టకేలకు స్పందించారు. శనివారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'పోలీస్.. ఇదేం తీరు..' కథనానికి జిల్లా పోలీసు యంత్రాంగం తీవ్రంగా స్పందించింది. పోలీసులు వ్యవహరించిన తీరుపై జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా సీరియస్ అయ్యారు. ఈ నేపథ్యంలో సంబంధిత పోలీసులపై తమదైన శైలిలో ఆదేశాలు జారీ చేశారు. ఇదే క్రమంలో ఈ ఘటనపై లోతుగా దర్యాప్తు ముమ్మరం చేసి తగిన నివేదిక అందజేయాలని విచారణ అధికారిగా నంద్యాల సబ్ డివిజన్ డీఎస్పీ మంద జావలి ఆల్ఫోన్స్‌ను నియమించారు. ఎస్పీ ఆదేశాలతో పాణ్యం సీఐ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎస్ఐలు నరేంద్రరెడ్డి, నాగార్జునరెడ్డి, స్థానిక వీఆర్వో హరిశ్చంద్రుడు సిబ్బందితో కలిసి ఘటనా స్థలంలో శనివారం క్షుణ్ణంగా పరిశీలించారు. దీంతో సుమారు 23 ఎముకలు, పళ్ల (దంతాలు), దుస్తులను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు.

మిగతా 7వ పేజీలో



ఘటన జరిగిన పొలంలో తనిఖీలు చేస్తున్న పోలీసులు

త్వరలోనే తరగతులు ప్రారంభిస్తాం

- కలెక్టర్ రాజకుమారి
- కేంద్రీయ విద్యాలయ భవనం పరిశీలన



డోన్ కేంద్రీయ విద్యాలయం ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రాజకుమారి

డోన్ టౌన్, మే 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐలో కేంద్రీయ విద్యాలయం తరగతులు త్వరలోనే ప్రారంభిస్తామని కలెక్టర్ రాజకుమారి గనియా అన్నారు. శనివారం నూతన భవనాన్ని ఆమె పరిశీలించారు. ఈ పరిశీలనలో భాగంగా కర్నూలు కేంద్రీయ విశ్వవిద్యాలయ ప్రిన్సిపాల్‌ను తరగతులు ఎప్పుడు ప్రారంభిస్తారని కలెక్టర్ ప్రశ్నించారు. విద్యాలయ కమిషనర్‌కు లెటరు పంపించామని, అక్కడి నుంచి ఆదేశాలు రాగానే ప్రారంభిస్తామని వివరించారు. అనంతరం పట్టణంలోని దొరపల్లె సమీపాన ఉన్న జగనన్న లేవుట్ కాలనీని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ కాలనీలో లబ్దిదారులకు సదుపాయాలు ఎందుకు కల్పించలేదని మున్సిపల్ శాఖ అధికారులను ప్రశ్నించగా.. గోరుకల్లు రిజర్వాయరు నుంచి జీడీపీ నుంచి తాగునీటి సదుపాయాలు కల్పించాలని కలెక్టర్‌ను కమిషనర్‌ను కోరారు. నీటి సదుపాయాలు లేకపోవడంతో లబ్దిదారులు నివాసానికి విము ఖత చూపుతున్నారన్నారు. వెంటనే మౌలిక సదుపాయాలు కల్పించాలని కలెక్టర్ మున్సిపల్ అధికారులకు ఆదేశించారు. కలెక్టర్ వెంట డీఈవో జనార్దన్‌రెడ్డి, ఆర్డీవో నరసింహులు, మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌గౌడు, తహసీల్దార్ నాగమణి, ఎంఈవో ప్రభాకర్, కర్నూలు కేంద్రీయ విశ్వవిద్యాలయ ప్రిన్సిపాల్ ప్రియదర్శిని, మున్సిపల్ డీఈ రఘు, ఏఈ సురేష్, హౌసింగ్ ఏఈ వీరేష్, సర్వేయర్ జగదీష్, అధికారులు ఉన్నారు.


సైనికుల సేవలు ఎనలేనివి

- రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్
- టీజీవీ కళాక్షేత్రంలో 'జై జవాన్' కల్చరల్ ఫెస్ట్ ప్రారంభం

6

తుంగభద్ర తీరం

సాహిత్యం



సాహితీ చరిత్రలో 'విస్మృత కార్యకర్త'ది ప్రత్యేక స్థానం

కర్నూలు కల్చరల్, మే 10 (ఆంధ్రజ్యోతి): తెలుగు సాహిత్య చరిత్రలో 'గామాగో' రాసిన ఈ 'విస్మృత కార్యకర్త' ఒక ప్రత్యేక స్థానం పొందింది. బహుశా ఈ కాలం వారికి తెలియని ఆనాటి జిల్లా ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుల్లో గామాగో ఒకరు. ఆయన స్వాతంత్ర్యానంతరం కూడా విశాల భారతావనిలో విలీనం కాని నాటి 'బనగానపల్లె నవాబుల సంస్థానం'పై మళ్లీ పోరాటం చేసిన యోధుడు. అప్పటి సంస్థానం విలీనం కోసం చేసిన పోరాటాన్ని, ఈనాం భూముల రద్దు లకోసం జరిగిన 'కరివేన సత్యాగ్రహ పోరాటాన్ని సవివరంగా రికార్డు చేసిన పుస్తకం ఇది. 1918-2002 మధ్య జరిగిన దేశ రాజకీయాలను, ఆంధ్రదేశం మీదా వాటి ప్రతిఫలాలను, ఆనాటి నాయకుల ద్వంద వైఖరులను కళ్లకు కట్టినట్లు ఈ పుస్తకం వివరిస్తుంది.

గామాగో ఒక విశిష్టమైన వ్యక్తి. ఆనాటి కోవెలకుంట్ల తాలూకాలోని భీమునిపాడు గ్రామంలో 1918 అక్టోబరు 23న జన్మించిన ఆయన అసలు పేరు ముక్కమళ్ల వేంకట సుబ్బారెడ్డి. గాంధీజీ అహింసా సిద్ధాంతాన్ని, మార్క్స్ బోధించిన ఆర్థిక సిద్ధాంతాన్ని, గోరా బోధించే నాస్తిక వాదాన్ని అమితంగా ఇష్టపడిన ఆయన ఆ ముగ్గురి పేర్లలోని మొదటి అక్షరాలతో తన పేరును 'గామాగో'గా మార్చుకున్నారు. వారి సిద్ధాంతాలను ఆయన ఇష్టపడటమే కాదు, జీవిత చరమాంకం వరకు ఆచరించి చూపాడు. పేద ప్రజల పట్ల అతనికి ఉన్న ఆకాంక్ష వెలకట్టలేనిది. విద్యా వికాసం ద్వారానే ప్రజా చైతన్యం సాధ్యమని నమ్మి, నిరక్షరాస్యులైన బడుగు, బలహీన వర్గాలకు రాత్రిపూట వయోజన విద్యా పాఠశాలలను ప్రారంభించి చదువు చెప్పేవారు. జాతీయోద్యమం గురించి, స్వేచ్ఛా స్వాతంత్ర్యాల గురించి, పరాయి పాలకుల దోపిడీ గురించి వివరిస్తూ ప్రజల్లో దేశ భక్తి బీజాలు నాటారు. 1942లో 'క్విట్ ఇండియా' ఉద్యమం ఉవ్వెత్తున ఎగసిపడింది. గామాగో చురుకుగా ఈ ఉద్యమంలో పాల్గొంటూ ఇతర విద్యార్థులను కూడగట్టుకొని సమ్మెలు, హర్తాళ్లు, కళాశాలల బహిష్కరణలు, రైలు రోకోలు లాంటి కార్యక్రమాలు విజయవంతంగా నడిపారు. తన ఉపన్యాసాలతో విద్యార్థులను, ప్రజలను ఉత్సాహ పరుస్తూ క్విట్ ఇండియా ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించారు. దీంతో బ్రిటీషు ప్రభుత్వం ఈయన కార్యకలాపాలపై కన్నెర్ర జేసింది. 1943 ఫిబ్రవరి 22న ఒక సభలో ఉపన్యాసం చేస్తుండగా పోలీసులు చుట్టుముట్టి విపరీతంగా కొట్టి ఆసుపత్రిలో చేర్పించారు. తర్వాత ఆరు నెలలు అలీపురం జైలులో కారాగార శిక్ష విధించారు. ఆ తర్వాత బయటకు వచ్చిన గామాగో ఆంగ్లేయ కళాశాల్లో బానిసగా చదువుకోవడానికి ఇష్టపడలేదు. తనకు చదువు కన్నా, దేశభక్తి ముఖ్యమని భావించి, కళాశాల విద్యను వదిలేసి మహాత్ముని నాయకత్వంలో ఉధృతంగా జాతీయోద్యమంలో పాల్గొన్నారు.

తుదిశ్వాస వరకు సాధారణ జీవితం గడిపిన గామాగో ఆత్మకథగా రాసుకున్న పుస్తకం తిరిగి ముద్రించి ప్రపంచానికి అందించే అవకాశం నాకు లభించడం చాలా సంతోషదాయకం. ఆయన ఇష్టమైన మార్క్స్‌పై 'మార్క్స్ జీవితం - సిద్ధాంతాలు' అనే మరో గ్రంథం తెనిగిస్తున్న సమయంలో ఆయన గుండె పోటుతో మృతి చెందారు. నాడు సర్వం త్యాగం చేసి పేద ప్రజల పక్షాన నిలిచిన గామాగో నేటి తరానికి నిజంగానే విస్మృత కార్యకర్తే.



- డాక్టర్ ఎం.హరికిషన్, పుస్తక పునర్ముద్రణ కర్త, సమీక్షకుడు, కర్నూలు

రంగస్థల నటనలో గిరిశిఖరం..!

- ఐదు దశాబ్దాలుగా రాణింపు
- పద్యాలాపనతోనే దినచర్య ప్రారంభం
- 74 ఏళ్ల ప్రాయంలోనూ కళల్లో రాణిస్తున్న దస్తగిరి





శ్రీకృష్ణ పాత్రధారణలో..,

కంచుతో సమానంగా మోగే కంఠం... హార్మోనియం పెట్టెనే రాగాలతో పరుగులు తీయించే గాత్రం.. గంభీరమైన వాచకాభినయం ఆయన సొంతం. నాలుగున్నర శ్రుతిలో రాగాలాపన అలవోలకగా పాడగల కళాకారుడు. ఒకటి కాదు, రెండు కాదు, తన 74 ఏళ్ల ప్రాయంలోనూ అదే స్ఫూర్తిని కొనసాగిస్తున్నారు. పౌరాణిక పద్య నాటక రంగంలో అప్రతిహత ప్రస్థానంతో జైత్రయాత్ర చేస్తూనే ఉన్నారు. ఐదు దశాబ్దాలుగా కర్నూలు కళామతల్లి కీర్తి కిరీటంలో కలికితురాయిగా నిలిచిపోయారు. ఆయనే కర్నూలుకు చెందిన సీనియర్ రంగస్థల కళాకారుడు, లలితకళా సమితి పూర్వ అధ్యక్షుడు పి.దస్తగిరి. రంగస్థలంపై నటుడిగా శ్రీకృష్ణ, శ్రీరామ, అర్జున, సత్యహరిశ్చంద్ర వంటి పౌరాణిక నాటకాలతోపాటూ చింతామణిలో భవానీ వంటి పాత్రలు ధరించి తనదైన వాణి, బాణితో ముందుకు సాగుతున్నారు. ఇతరులు అనుసరించలేని గాత్రపాండిత్యంతో ఆయన... తనకు తానే పోటీగా నిలుస్తున్నారు. మరోవైపు రేడియో గాయకునిగానూ బీ-హై గ్రేడ్ ఆర్టిస్టు గుర్తింపు పొంది కర్నూలు, కడప, విజయవాడ, హైదరాబాదు ఆకాశవాణి కేంద్రాల్లోనూ తరచూ శ్రోతలను అలరిస్తున్నారు. వృత్తిరీత్యా జూనియర్ కళాశాల అధ్యాపకునిగా పదవీ విరమణ చేసినా, ప్రవృత్తి రీత్యా రంగస్థల నటుడిగా ఔత్సాహిక కళాకాలరులకు మార్గదర్శకంగా నిలుస్తున్నారు.

-కర్నూలు కల్చరల్, మే 10 (ఆంధ్రజ్యోతి)

బాల్యం...చదువు, ఉద్యోగ జీవితం

నందవరం మండలం మాచాపురం గ్రామానికి చెందిన పి.హుస్సేన్ బీ, ఖాసీం దంపతులకు 1952 జూలై 1న జన్మించిన దస్తగిరిది వ్యవసాయ కుటుంబం. 1969లో ఎస్ఎస్ఎల్‌సీ పూర్తి చేసి, 1970లో పీయూసీ కర్నూలు ఉస్మానియా కళాశాల్లో చేరారు. అక్కడే బీఏ 1974లో పూర్తి చేశారు. అనంతరం తిరుపతి ఎస్వీ యూనివర్సిటీలో ఎంఏ 1976లో పూర్తిచేసి 1978 వరకు ఎంజీ బ్రదర్స్ సంస్థలో ట్రైనీ మేనేజర్‌గా పని చేశారు. తర్వాత 1980లో కర్నూలు సెయింట్ మేరీస్ జూనియర్ కళాశాల్లో ఎంఏ (పొలిటిక్స్) తాత్కాలిక అధ్యాపకునిగా చేరి, 1984లో ఏపీపీఎస్‌సీ అధ్యాపక పరీక్షలు రాసి, అదే కళాశాల్లో ప్రభుత్వ అధ్యాపకునిగా నియమితులయ్యారు. 2010లో అదే కళాశాల్లో పదవీ విరమణ చేశారు.



శ్రీకృష్ణ విజయం నాటకంలో ఒక దృశ్యం

బాల్యం నుంచీ నటనలో ఆసక్తి...

స్వగ్రామంలోని పినతండ్రి ఖాసీం పాడే శ్రీకృష్ణ రాయబారంలోని పద్యాలు వింటూ ఆ పద్యాలపై దస్తగిరి ఆసక్తి పెంచుకున్నారు. హైస్కూలు చదివే రోజుల్లో 1969లో శ్రీకృష్ణ వేషంలో ద్వారకా ఘట్టాన్ని ప్రదర్శించారు. నాటి పాఠశాల హెచ్ఎం శామ్యూల్ జార్జ్ (మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్ తండ్రి) దస్తగిరిని నాటక రంగంలో వెన్నుదట్టారు. స్కూల్ లీవింగ్ సర్టిఫికెట్‌లో 'ప్రత్యేక ప్రతిభ కలిగిన విద్యార్థి' అని రాశారు. అలాగే నాటి హార్మోనిస్టు గిరిస్వామి పద్యాలాపన, రాగాలు, శృతి స్థాయిలను దగ్గర ఉండి నేర్పించారు. నాటక రంగంలో శ్రీకృష్ణ పాత్రతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న దస్తగిరి శ్రీకృష్ణాభిమన్యు, రామాంజనేయ యుద్ధం, శ్రీకృష్ణాంజనేయ యుద్ధం, భక్త మాదవదాసు, సత్య హరిశ్చంద్ర పాత్రల్లో ప్రేక్షకులను మెప్పించారు. సుమారు రెండు వేలకు పైగా ప్రదర్శనలు ఇచ్చారు. కర్నూలులో సహచర కళాకారులు డి.రంగముని, తిమ్మయ్య వంటి హార్మోనిస్టులతో కలిసి నాటక ప్రదర్శనలు చేస్తూనే నాటి లలిత కళా సమితి (నేటి టీజీవీ కళాక్షేత్రం)కు మూడో అధ్యక్షునిగా ఎంపికై 1998 నుంచి 2002 వరకు సేవలు అందించారు. 1985 నుంచి ఆకాశవాణి కడప రేడియోలో ఆర్టిస్టుగా గుర్తింపు తెచ్చుకొని అనేక పద్యాలు, నాటకాలు ప్రదర్శించారు. 1991లో కర్నూలు ఆకాశవాణి కేంద్రం ఏర్పడ్డాక ఇక్కడ కూడా ప్రదర్శనలు ఇస్తూ ప్రస్తుతం ఆకాశవాణి బీ-హై గ్రేడ్ ఆర్టిస్టుగా రాణిస్తున్నారు. కళల్లో రాణిస్తూ అభినవ ఏవీ సుబ్బారావు అనే బిరుదును సాధించారు. 1983లో నాటి ప్రఖ్యాత నటుడు షణ్ముఖి ఆంజనేయరాజు వంటి నటులతో నటించి ప్రశంసలు అందుకున్నారు. రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా ఢిల్లీలోని ఆంధ్రభవన్‌లో 2004లో ద్వారక ఘట్టం ప్రదర్శించారు. 1999లో నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా నంది అవార్డు అందుకున్నారు.



శ్రీకృష్ణ తులాభారంలో ఒక దృశ్యం



నాటి ఉప ముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తి చేతుల మీదుగా సత్కారం అందుకుంటూ...



శ్రీకృష్ణ రాయబారం ద్వారకా ఘట్టంలో..

వైభవంగా చెన్నకేశవస్వామి కల్యాణం

పట్టు వస్త్రాలు సమర్పించిన మంత్రి బీసీ దంపతులు



స్వామివారికి సమర్పించేందుకు పట్టు వస్త్రాలు తీసుకెళ్తున్న మంత్రి బీసీ దంపతులు

బనగానపల్లె, మే 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కోట వీధిలో వెలసిన భూలక్ష్మి సమేత చెన్నకేశవస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణం అంగరంగ వైభవంగా శనివారం నిర్వహించారు. స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా అర్చకులు ఉత్సవమూర్తులను కల్యాణ మండపం వద్దకు చేర్చి పట్టు వస్త్రాలు పూలమాలలతో అలంకరించారు. మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, బీసీ ఇందిరమ్మ దంపతులు ఆలయానికి చేరుకొని స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించి కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. స్వామివారిని దర్శించుకొని మంత్రి దంపతులు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారి కల్యాణం తిలకించారు. రాత్రి ఉత్సవమూర్తులను హనమంత్ వాహనంపై ఊరేగించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఉగ్రసేనారెడ్డి, నాయకులు వెంకటరమణ నాయక్, పక్కిన మద్దిలేటి గౌడ్, అరుణ్‌కుమార్‌నాయక్, దంతెల రమణ, తిక్కన్న, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



చెన్న కేశవస్వామి కల్యాణాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

అమ్మ అనురాగం..

నంద్యాల కల్చరల్, మే 10(ఆంధ్రజ్యోతి): నంద్యాలకు చెందిన ప్రముఖ చిత్రకారుడు చింతలపల్లె కోటేష్.. అమ్మ ప్రేమ అనురాగం గురించి అరచై సూక్ష్మచిత్రాలను వాటర్ కలర్స్‌తో మైక్రోబ్రష్ ద్వారా రెండు గంటల సమయంలో చిత్రీకరించారు. ప్రపంచ మాతృ దినోత్సవం పురస్కరించుకొని చిత్రకారుడు కోటేష్ అమ్మ అనురాగం చిత్రంలో బిడ్డలపై తల్లి మమకారం ఎలాఉంటుందో చూపించారు. ఈచిత్రంలో మనుషులతో పాటు, జింకలు, ఆవులు, గేదెలు, ఏనుగు, జిరాఫీ, కుక్కలు, నక్కలు, కుందేళ్లు, బాతులు, కొంగలు, కాకులు, పావురాలు ఇలా ఎన్నో వాటి పిల్లలతో ప్రేమతో ఉన్నట్లు వేశారు. ఈచిత్రాన్ని కోటేష్ తన మాతృమూర్తికి అంకితం చేశానన్నారు. మాతృదినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.



అమ్మ అనురాగం గురించి చిత్రంలో చూపించిన చిత్రకారుడు కోటేష్



చిత్రకారుడు కోటేష్

కమనీయం.. నృసింహస్వామి రథోత్సవం

- గోవింద నామస్మరణతో మార్మోగిన మాడ వీధులు
- స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు
- అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులు



అశేష భక్తుల మధ్య స్వామి రథోత్సవం

ఆళ్లగడ్డ, మే 10(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన ఎగువ అహోబిలంలో నృసింహస్వామి రథోత్సవం కన్నుల పండువగా సాగింది. వేదపండితులు కిడాంబి వేణుగోపాలన్‌స్వామి, మణియర్ సౌమ్యనారాయణన్ జ్వాలా నరసింహస్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్ల ఉత్సవమూర్తులను రథంపై అలంకరించి ప్రత్యేక పూజలు చేశా రు. ఈ సందర్భంగా భక్తులు పెద్దఎత్తున గోవింద నామస్మరణలు చేస్తూ తరించారు. ఉత్సవ మూర్తులైన శ్రీదేవి, భూదేవి సమేత జ్వాలా నరసింహస్వామిని అందంగా అలంకరించి పల్లకిలో కొలువు దీర్చి మాడ వీధులలో ఊరేగించారు. సాయంత్రం స్వామి పుష్ప పల్లకోత్సవాన్ని నిర్వహించారు. ఈ పూజాలకు అహోబిలంకు చెందిన లక్ష్మమ్మ, శేషాచార్యులు, గిద్దలూరుకు చెందిన సతీష్, హైదరాబాద్‌కు చెందిన విజయకుమార్ ఉభయదారులుగా వ్యవహరించారు. వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

సైనికుల సేవలు ఎనలేనివి

- రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్
- టీజీవీ కళాక్షేత్రంలో 'జై జవాన్' కల్చరల్ ఫెస్ట్ ప్రారంభం



ప్రసంగిస్తున్న టీజీ వెంకటేశ్





దేశభక్తి గీతాలకు జానపద కళాకారుల నృత్యాలు



కర్నూలు కల్చరల్, మే 10 (ఆంధ్రజ్యోతి): దేశం కోసం ప్రాణాలర్పిస్తున్న సైనికుల సేవలు ఎనలేనివని రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ అన్నారు. నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో వారం రోజుల పాటు ఏర్పాటు చేసిన 'జై జవాన్' కల్చరల్ ఫెస్టివల్‌ను ఆయన శనివారం ఘనంగా ప్రారంభించారు. తొలుత భరతమాత చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా టీజీ వెంకటేశ్ మాట్లాడుతూ తన పుట్టిన రోజు వేడుకల్లో భాగంగా 'జై జవాన్ ఫెస్టివల్' నిర్వహించుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ప్రతి ఏటా మే16వ తేదీన కులమతాలకు అతీతంగా సామూహిక వివాహాలు నిర్వహిస్తున్నామన్నారు. ఇంకా ఎవరైనా జంటలు పేర్లు నమోదు చేసుకోవాలనుకుంటే ఆదివారంలోగా సంప్రదించాలన్నారు. మనం ఎంత సేవ చేసినా సముద్రంలో నీటిబొట్టులాంటిదేనని, కానీ దేశానికి సేవలు అందించే సైనికుల సేవలు వెలకట్టలేనివని అన్నారు. ఉగ్రవాదాన్ని అంతమొందించేందుకే భారత ప్రధాని మోదీ యుద్ధానికి సిద్ధపడ్డారన్నారు. ఇప్పటికే టెర్రరిస్టు స్థావరాలను నాశనం చేశారని, ప్రతిదాడులని తిప్పి కొట్టారని చెప్పారు. ఈ సందర్భంగా దేశ భక్తిపై రూపొందించిన సాంస్కృతిక అంశాలను ప్రదర్శించిన కళాకారులను ఆయన శాలువలతో ఘనంగా సత్కరించారు. టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య మాట్లాడుతూ కళాక్షేత్రంలో వారం రోజుల పాటూ దేశభక్తిని చాటిచెప్పేలా సాంస్కృతిక కార్యక్రమాలు ప్రతిరోజూ ఒక గంట ప్రదర్శిస్తారమని, దేశ సైనికులకు సంఘీభావం తెలుపుతూ టీజీవీ కళాక్షేత్రం పక్షాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాకారులు మహ్మద్ మియా, యాగంటీశ్వరప్ప, శ్రీనివాసరెడ్డి, సీవీ రెడ్డి, వీవీ రమణారెడ్డి, పి.రాజారత్నం, వాల్మీకి రాముడు తదితరులు పాల్గొన్నారు.

దేశభక్తిపై ప్రదర్శనలు : ఒకవైపు ఉప్పొంగే దేశభక్తిని, మరోవైపు దేశం సరిహద్దులో యుద్ధం చేస్తూ దేశానికి రక్షణగా నిలుస్తున్న సైనికుల వీరోచిత పోరాటాలను కళ్లకు కట్టినట్లు చూపిస్తూ కళాకారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను అసాంతం అలరింపజేశాయి. కళాకారులు శ్రీనివాసరెడ్డి, సంగా ఆంజనేయులు, నృత్యకళాకారులు కరీముల్లా, సుమాంజలి, కార్తీక, సుదేష్ణ, సత్య, తేజశ్విని, తన్విశ్రీ, కేదారి, గాయకులు సుజాత, మహ్మద్ మియా, ఘంటసాల శ్రీనివాస్, ఖాజావలి, కె. బాలవెంకటేశ్వర్లు, జానపద నృత్యకారులు సమీర, అఖిల, హరిబాబు, సుబ్బరాయుడు, నారాయణ తదితరులు అలరించారు.

నేడు రామాంజనేయ యుద్ధం నాటకం : జై జవాన్ కల్చరల్ ఫెస్ట్‌లో భాగంగా ఆదివారం సాయంత్రం దేశభక్తిని ప్రబోధించే జానపద, సినీ సంగీత విభావరి, అనంతరం రామాంజనేయ యుద్ధం నాటక ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య తెలిపారు.



సైనికుడిగా కళాకారుడు శ్రీనివాసరెడ్డి

నైరాశ్యంలో కార్యదర్శులు



జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయం

- జాబితా సిద్ధంచేసి ఏడు మాసాలు
- నేటికీ అందని పదోన్నతులు
- సీనియార్టీలో వెనుకబడుతామని ఆవేదన
- కొన్ని జిల్లాలో పూర్తయిన ప్రక్రియ

కర్నూలు కలెక్టరేట్, మే 10 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్లుగా పదోన్నతులు లేక పంచాయతీ కార్యదర్శులు నైరాశ్యంలో కూరుకుపోయారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొన్నినెలలకే తీపి కబురు అందించింది. పంచాయతీరాజ్ వ్యవస్థను ప్రక్షాళన చేస్తూనే అందులో పనిచేస్తున్న సిబ్బందికి పదోన్నతులు కల్పించాలని నిర్ణయం తీసుకుంది. ఈ శాఖలో ఉన్న ఖాళీలను గుర్తించి గతేడాది నవంబరు 30న పదోన్నతుల ప్రక్రియ పూర్తి చేయాలని నిర్ణయించింది. కిందిస్థాయిలో సీనియారిటీ జాబితాల రూపకల్పనలో ఎడతెగని జాప్యం కారణంగా ఏడు మాసాలు గడిచిపోయాయి. గ్రేడ్-1, గ్రేడ్-2 పదోన్నతులను పంచాయతీరాజ్ శాఖ కమిషనరేట్ స్థాయిలో నిర్ధారిస్తారు. గ్రేడ్-3, 4, 5, 6 వరకు పదోన్నతులను జిల్లా గ్రామ పంచాయతీ అధికారి వారి కార్యాలయం నిర్ధారణ చేయాల్సి ఉంది.

ఉమ్మడి జిల్లాలో..

ఉమ్మడి కర్నూలు జిల్లాలో గ్రేడ్-1 ఖాళీలు-3, గ్రేడ్-2 ఖాళీలు 18 ఉన్నాయి. అదే విధంగా గ్రేడ్-3 ఖాళీలు 16, గ్రేడ్-4 ఖాళీలు 118, గ్రేడ్-5 ఖాళీలు 29 ఉన్నాయి. ఇవి కాకుండా పైనుంచి మరికొన్ని ఖాళీలు ఏర్పడే అవకాశం ఉన్నందువల్ల తాము నిరీక్షిస్తున్నట్లు ఉన్నతాధికారులు చెబుతున్నారు. ఈవిషయమై గత నెలలో పంచాయతీ రాజ్ శాఖ కమిషనర్ ఒక స్పష్టతను ఇచ్చారు. ప్రస్తుతం ఉన్న ఖాళీలతో పదోన్నతులు భర్తీచేయాలని ఆదేశాలిచ్చారు. ఇందుకోసం తక్షణమే దస్త్రం రూపొందించి పదోన్నతులు ఇవ్వాలన్నారు. పైనుంచి తర్వాత వచ్చే ఖాళీలను మరో దస్త్రం ద్వారా రూపకల్పన చేసి పదోన్నతులు ఇవ్వవచ్చని ఆదేశాలు జారీచేశారు. ఈప్రక్రియ అంతా ఏప్రిల్ 30 లోగా పూర్తికావాలని ఆయన నిర్దేశిత గడువును కూడా విధించారు.

ఈవోపీఆర్డీ పేరును డిప్యూటీ ఎంపీడీవోగా..

గతంలో విస్తరణాధికారిగా (ఈవోపీఆర్డీ) ఉన్న పేరును జీవో.నెం.35 ప్రకారం డిప్యూటీ ఎంపీడీవోగా మార్చారు. గత నెలాఖరులో డిప్యూటీ ఎంపీడీవోలుగా ఉన్న వారికి ఎంపీడీవోలుగా పదోన్నతి కల్పించారు. ఇక గ్రేడ్-1 పంచాయతీ కార్యదర్శులుగా పనిచేస్తున్న వారికి డిప్యూటీ ఎంపీడీవోలుగా పదోన్నతి కల్పించే దస్త్రం కమిషనరేట్ పరిధిలో తుది దశలో ఉంది. ఈనేపథ్యంలో ప్రస్తుతం ఉన్న ఖాళీలతో ఉమ్మడి జిల్లాలో పదోన్నతుల ప్రక్రియను పూర్తి చేయవచ్చు. ఇప్పటికే తూర్పు గోదావరి, కృష్ణ, చిత్తూరు, శ్రీకాకుళం వంటి జిల్లాలో పదోన్నతులిచ్చి రెండు నెలలు పూర్తయ్యాయి. భవిష్యత్తులో ఉమ్మడి కర్నూలు జిల్లా పంచాయతీ కార్యదర్శులు జోనల్ విధానంలో సీనియారిటీ జాబితాలో వెనుకబడిపోతామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

త్వరలో పూర్తి చేస్తాం



గ్రేడ్-1, గ్రేడ్-2 పదోన్నతులు ప్రక్రియ త్వరలో పూర్తి కానున్నాయి. జిల్లాలో గ్రేడ్-2 పదోన్నతులు 65 మందికి లభించాయి. గ్రేడ్-3 నుంచి గ్రేడ్-6 వరకు పదోన్నతులు 15 రోజుల్లో పూర్తిచేస్తాం.

- భాస్కర్, డీపీవో, కర్నూలు

మిస్టరీ వీడేనా..?



వివరాలు నమోదు చేస్తున్న పోలీసులు, రెవెన్యూ సిబ్బంది

(5వ పేజీ తరువాయి)

ఆ తర్వాత కర్నూలు ప్రభుత్వ ఫోరెన్సిక్ వైద్యులకు తగిన ఫొటోలను పంపించారు. వాటిని స్వాధీనంచేసుకుని ల్యాబ్‌కు పంపించారు.

ఎట్టకేలకు కేసు నమోదు

గుర్తుతెలియని వ్యక్తి మృతి ఘటనపై గడివేముల పోలీసులు ఎట్టకేలకు కేసు నమోదు చేశారు. నిజానికి పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లిన రోజే కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించి ఉంటే పరిస్థితి ఇంతదాకా వచ్చేది కాదని పోలీసు వర్గాల్లో చర్చ సాగుతోంది. ఫోరెన్సిక్ ల్యాబ్ నివేదిక ఆధారంగా లభించిన ఆనవాళ్లు మనషులవే అని తేలితే విచారణను వేగవంతం చేసే అవకాశం ఉంది. మిస్సింగ్ కేసుల ఆధారంగా విచారణ చేసి లభించిన ఆనవాళ్లతో వారి రక్తసంబంధీకులకు డీఎన్ఏ పరీక్ష చేస్తే కేసు కొలిక్కి వచ్చే అవకాశం ఉంది. ఇదిలా ఉండగా లభించిన ఆనవాళ్లపై పలు ఆసక్తికరమైన విషయాలు వెలుగులోకి వచ్చినట్లు తెలుస్తోంది. ఈఆనవాళ్లు పోలీసులు కూడా గుర్తించలేని స్థితిలో ఉండటం గమనార్హం. పైగా కాలిపోయి ఉండటం మరింత విస్మయం కలిగిస్తోంది. ఈ ఎముకలు మనుషులవా లేక జంతువులవా? అనే సందేహాలు కలుగుతున్నాయి.

గడివేములలో కలకలం

గుర్తు తెలియని శవానికి సంబంధించి ఆనవాళ్లను నామరూపం లేకుండా చేసిన ఈ ఘటన రెండురోజులుగా గడివేముల మండల వ్యాప్తంగా కలకలం రేపింది. తాజాగా శనివారం పోలీసులు బృందాలుగా ఏర్పడి ఘటన స్థలంతో పాటు మండలం కేంద్రంలో విచారణ చేయడంతో మరింత చర్చనీయాంశంగా మారింది. ఈ శవం ఎవరిదన్న విషయం పక్కనపెడితే.. పోలీసులు వ్యవహరించిన తీరుపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రైతులు, స్థానికుల తెలుపుతున్న సమాచారం మేరకు లభ్యమైన ఎముకలు అస్థిపంజరానికి సంబంధించినవేనని స్పష్టమవుతోంది. ఏదిఏమైనా ఫోరెన్సిక్ ల్యాబ్ ఇచ్చే నివేదికపైనే కేసు మిస్టరీ ఆధారపడి ఉంది.

పసుపు కొమ్ములు దగ్ధం



అల్లినగరంలో కాలిబూడిదైన పసుపు కొమ్ములు

మహానంది, మే 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అల్లినగరం సమీపంలో విత్తనం కోసం రైతులు తెచ్చుకొన్న పసుపు శనివారం అగ్ని ప్రమాదంలో కాలి బూడిదయ్యింది. దీంతో మండలంలోని బుక్కాపురం గ్రామానికి చెందిన రైతులు ఈశ్వరయ్య, సూరి, రవి, ప్రసాద్ ఇటీవల వైఎస్సార్ జిల్లా మైదుకూరు మండలం కేసి లింగయాపల్లె నుంచి విత్తనం పసుపును కొనుగోలు చేసి అల్లీనగరం సమీపంలో భద్రపరుచుకున్నారు. అయితే శనివారం అగ్ని ప్రమాదం జరగడంతో పసుపు కాలిపోయింది. గమనించిన స్థానికులు నంద్యాల అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చారు. వెంటనే రంగంలోకి దిగిన సిబ్బంది ఘటనా స్థలంలో మంటలను ఆర్పివేసారు. అప్పటికీ పసుపు పూర్తిగా కాలిపోయి బూడిదయ్యింది. రూ.4 లక్షలు నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం నష్ట పరిహారం అందించి ఆదుకోవాలని బాధిత రైతులు కోరారు.

అన్న మరణం తట్టుకోలేక..

- రైలు కిందపడి తమ్ముడి బలవన్మరణం
- శోకసంద్రంలో కుటుంబం



మృతదేహన్నిపరిశీలిస్తున్న పోలీసులు

కర్నూలు క్రైం, మే 10 (ఆంధ్రజ్యోతి) : సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న అన్న కొన్ని రోజుల క్రితం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకోగా దీని జీర్ణించుకోలేక శనివారం తమ్ముడు రైలు కింద పడి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటనలో నగరంలోని అబ్బాస్‌నగర్ రైల్వే ట్రాక్ సమీపంలో చోటుచేసుకున్నట్లు రైల్వేపోలీసులు తెలిపారు. వివరాలు.. రామచంద్రనగర్‌కు చెందిన ఈడిగ శ్రీనివాసులు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నారు. ఈయనకు ఇద్దరు కొడుకులు, ఒక కూతురు సంతానం. పెద్దకొడుకు రాజేష్‌గౌడుకు ఇటీవలే పెళ్లి చేశారు. హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పని చేస్తూ పెళ్లయిన 20 రోజులకు అక్కడే ఆత్మహత్య చేసుకున్నాడు. అప్పటినుంచి చిన్న కొడుకు వంశీకృష్ణ(29) అన్న మరణాన్ని జీర్ణించుకోలేక బాధపడతూ ఉండేవాడు. ఈవిషయంపై తల్లిదండ్రులు అతడిని సైక్రియాటిస్టు వద్ద చూపించారు. ఈనెల 7వ తేదీన తల్లిదండ్రులు బంధువుల పెళ్లికి వెళ్లారు. 9వ తేదీ ఉదయం ఇంటి వచ్చేసరికి వంశీకృష్ణ కనిపించలేదు. సెల్‌ఫోన్ కూడా స్విచ్చాప్ కావడంతో అన్ని చోట్ల వెతికారు. శనివారం ఉదయం అబ్బాస్‌నగర్ సమీపంలో ఖానా ఖజానా రైల్వేట్రాక్ పక్కన వంశీకృష్ణ శవమై కనిపించాడు. తన చావుకు ఎవరూ కారణం కాదని, అమ్మా, నాన్న సారీ అంటూ సూసైడ్ నోట్ రాసుకున్నాడు. నోట్‌లో తండ్రి ఫోన్ నెంబరు ఉండటంతో ఆనెంబరకు ఫోన్‌చేసి తండ్రికి సమాచారం ఇచ్చారు. పోలీసులు మృతదేహాన్ని మార్చురీకి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. మృతుడు వంశీకృష్ణ ఎంఎస్సీ చదివి ప్రస్తుతం కర్నూలు ఇంటి వద్దనే ఉంటున్నాడు. కేసు నమోదు చేసినట్లు రైల్వే సీఐ శ్రీనివాసరెడ్డి తెలిపారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

గడివేముల, మే 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎల్‌కే తండా గ్రామ శివారులో విద్యుదాఘాతానికి గురై వ్యక్తి మృతి చెందారు. ఎస్ఐ నాగార్జునరెడ్డి తెలిపిన వివరాలివీ.. ఎల్‌కే తండా గ్రామానికి చెందిన వెంకట్‌నాయక్ మేకల మేత కోసం చెట్టుపైకి ఎక్కి కొమ్మలు కోస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు తగిలాయి. దీంతో వెంకట్‌నాయక్ అక్కడికక్కడే మృతి చెందారు. వెంకట్‌నాయక్‌కు ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె సంతానం. ఆయన భార్య పార్వతీబాయి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

నందికొట్కూరు, మే 10 (ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులోని ఎన్టీఆర్ జలాశయంలో ఓ గుర్తుతెలియని మృతదేహం లభ్యమైంది. వివరాలివీ.. శనివారం ఉదయం స్థానికులు ఎన్టీఆర్ జలాశయం నీటిలో మృతదేహన్ని చూసి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహన్ని పరిశీలించారు. మృతుడి వయసు దాదాపు 70ఏళ్లు ఉంటుందని చెప్పారు. మృతదేహన్ని నందికొట్కూరు ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్ రెడ్డి తెలిపారు. మృతదేహనికి పోస్టుమార్టం నిర్వహించి మృతికి గల కారణాలను తెలుసుకుంటామని తెలిపారు. ఎవరైనా ఇంట్లో తప్పిపోయి ఉన్న వారి కుటుంబసభ్యులు పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని ఆయన తెలిపారు.

కేంద్ర ఫుడ్ కార్పొరేషన్ సభ్యుడిగా విశ్వనాథరెడ్డి



నంద్యాల రూరల్, మే 10 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ఫుడ్ కార్పొరేషన్ సభ్యుడిగా నంద్యాలకు చెందిన నరహరి విశ్వనాథరెడ్డి నియమిస్తూ కేంద్రం ఉత్తర్వులు జారీచేసినట్లు నరహరి విశ్వనాథరెడ్డి శనివారం తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి చొరవతో ఈ పదవి దక్కిందన్నారు. ఎంపీకి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

అదనపు హెచ్ఆర్ఏ తొలగింపు అన్యాయం

- ఏపీ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు బాలునాయక్



సంఘీభావం తెలుపుతున్న నాయకులు

కర్నూలు హస్పిటల్, మే 10 (ఆంధ్రజ్యోతి): కర్నూలు ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో పనిచేస్తున్న ఎంఎన్‌వోలకు అదనపు హెచ్ఆర్ఏను ట్రెజరీ అధికారులు తొలగించడం అన్యాయమని ఏపీ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు బాలునాయక్ అన్నారు. శనివారం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల యూనియన్ ఆఫీసులో ఎంఎన్‌వోల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వంతో చర్చించి యూనియన్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు రామచందర్ అదనపు హెచ్ఆర్ఏ కోసం ప్రభుత్వంతో చర్చించి 1983లో జీవో తెప్పించారన్నారు. కర్నూలు జీజీహెచ్‌లో ట్రెజరీ అధికారులు ఈనెల నుంచి ఎంఎన్‌వోలకు అదనపు హెచ్ఆర్ఏను తొలగించారన్నారు. దాదాపు 60 మంది ఎంఎన్‌వోలు ఉన్నారని, రాత్రి పగలు కష్టపడి విధులు నిర్వహించేవారు నష్టపోతారని అన్నారు. అదనపు హెచ్ఆర్ఏ తొలగించడం పై సోమవారం నుంచి ఆందోళన చేపడుతామన్నారు. యూనియన్ కోశాధికారి సురేష్, సర్జెంట్ ఉరుకుందయ్య, చిన్నయ్య, దాస్, వెంకటేశ్వర్లు, నవీన్ పాల్గొన్నారు.

రేపటి నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు



కర్నూలు ఎడ్యుకేషన్, మే 10 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఉదయం 9నుంచి 12 గంటల వరకు మొదటి సంవత్సరం పరీక్షలు, మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు ద్వితీయ సంవత్సరం పరీక్షలు జరుగుతాయి. కర్నూలు జిల్లాలో ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 21,324 మంది హాజరువుతున్నారు. మొత్తం 52 పరీక్షా కేంద్రాలను అధికారులు సిద్ధం చేశారు. జిల్లా పరీక్షల విభాగం కన్వీనర్, ఆర్ఐవో గురువయ్యశెట్టి, డీవీఈవో సురేష్‌బాబు డీఈసీ కమిటీ సభ్యులు జి.లాలెప్ప, సురేష్ చంద్ర, పద్మావతితో పాటు, సిట్టింగ్, ఫ్లయింగ్ స్క్వాడ్‌లు పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తారు. జిల్లాలో ఏడు సమస్యాత్మక కేంద్రాలను గుర్తించారు. కృష్ణగిరి ఏపీ మోడల్ స్కూల్, ఆలూరు, పత్తికొండ, దేవనకొండ, కోసిగి, చిప్పగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోని పరీక్షా కేంద్రాలను సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించి మాల్ ప్రాక్టీసు జరగకుండా చర్యలు తీసుకుంటున్నారు. నిమిషం ఆలస్యమైనా పరీక్షా కేంద్రంలోకి అనుమతించేది లేదని ఆర్ఐవో ఎస్‌వీఎస్ గురువయ్యశెట్టి వెల్లడించారు. పరీక్షా కేంద్రాల్లోకి చీఫ్ సూపరింటెండెంట్లు మినహా ఎవరూ సెల్‌ఫోన్లు తీసుకెళ్లకూడదని హెచ్చరించారు.

కర్నూలు జిల్లాలో 25వేల మట్టి పరీక్షలు

కర్నూలు అగ్రికల్చర్, మే 10 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఖరీఫ్‌కు రైతుల పొలాల్లో సారాన్ని బట్టి అవసరమైన మోతాదులో వివిధ రకాల ఎరువులను వినియోగించేందుకు భూసార మట్టి పరీక్షలు నిర్వహించేందుకు కార్యచరణ ప్రణాళికను సిద్ధంచేశారు. కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులోని భూసార పరీక్షలో 12,931 మట్టి పరీక్షలు, ఎమ్మిగనూరు భూసార పరీక్ష కేంద్రంలో 13,011 మట్టి పరీక్షలు నిర్వహించనున్నారు.

కర్నూలు మార్కెట్ యార్డులోని పరీక్షా కేంద్రంలో 13 మండలాలకు చెందిన మట్టి నమూనాలను పరిశీలించనున్నారు. మిగిలిన 13 మండలాల పరిధిలోని పొలాలకు చెందిన మట్టి పరీక్షలను ఎమ్మిగనూరులో పరీక్షించనున్నారు. ఈ మట్టి నమూనాల పరీక్షల అనంతరం ఏ ఎరువు ఎంత శాతం లోపం ఉందో... ఏ ఎరువు అధిక మొత్తంలో నిక్షిప్తమై ఉందో తెలుసుకుని ఆ మేరకు ఎరువులను వినియోగించేందుకు రైతులకు సూచనలు చేస్తారు. మట్టి పరీక్షల కోసం జిల్లా వ్యవసాయ శాఖ జేడీ వరలక్ష్మి ఇటీవల రైతుల పొలాల్లో మట్టి నమూనాలు ఏవిధంగా సేకరించాలనే విషయంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ప్రతి రైతు సలహా కేంద్రం నుంచి 55 మట్టి నమూనాలు సేకరించే విధంగా లక్ష్యాన్ని కేటాయించారు. రైతులు పొలాల్లో విత్తనాలు వేసే సమయానికల్లా ఈ మట్టి పరీక్షలు రైతులకు అందుబాటులోకి ప్రత్యేక కార్డుల ద్వారా అందిస్తామని జేడీ వరలక్ష్మి తెలిపారు.

91 కేసులు నమోదు

నంద్యాల టౌన్, మే 10 (ఆంధ్రజ్యోతి): గడి చిన 24 గంటల్లో 91 కేసులు నమోదు చేసినట్లు ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా తెలిపారు. ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా విజిబుల్ పోలీసింగ్ , అనుమానితులను, వారి వేలిముద్రలను పరిశీలించారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణ కోసం మద్యం, ఇసుక, గంజాయి, ఇతర మాదక ద్రవ్యాలు అక్రమ రవాణ నియంత్రించడానికి, శాంతిభద్రతల పరిరక్షణ కోసం ఈ తనిఖీలు చేసినట్లు తెలిపారు.

గృహాలను పూర్తిచేయండి

వెల్దుర్తి, మే 10 (ఆంధ్రజ్యోతి): మండలంలో నిలిచిపోయిన గృహ నిర్మాణాలను జూన్ 12లోపు పూర్తిచేయాలని హౌసింగ్ పీడీ చిరంజీవి అధికారులను ఆదేశించారు. శనివారం వెల్దుర్తి మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో హౌసింగ్ అధికారులతో గృహ నిర్మాణల పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహిం చారు. పీడీ మాట్లాడుతూ ప్రభుత్వం బీసీ, ఎస్సీలకు రూ.50వేలు, ఎస్టీలకు రూ.75వేలు అదనపు ఆర్థిక సాయం ప్రకటించిందన్నారు. ఈ పథకం కింద మండలంలో 97 మంది లబ్దిదారులు అర్హత పొందారని, వారి గృహాలను జూన్ 12లోపు చేయాలన్నారు. ఆదేశించారు. కార్యక్రమంలో ఈఈ ప్రభాకర్, డీఈ విజయ్ కుమార్, హౌసింగ్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.



సిబ్బందితో మాట్లాడుతున్న హౌసింగ్ పీడీ చిరంజీవి

అపూర్వ సమ్మేళనం



ఉపాధ్యాయులతో జడ్పీ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు



బేతంచెర్ల శేషారెడ్డి ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

కొలిమిగుండ్ల, మే 10 (ఆంధ్రజ్యోతి) : కొలిమిగుండ్లలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. పాఠశాలలో 2002-2003లో పదో తరగతి విద్యనభ్యసించిన విద్యార్థులు శనివారం కలుసుకున్నారు. అలనాటి జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. తమకు విద్యను బోధించిన గురువులు వైవీఎస్ నారాయణరెడ్డి, బాలసుబ్బారెడ్డి, విజయప్రసన్న, రాఘవేంద్ర ప్రసాద్, శేషమరాజు, రమణారెడ్డి తదితరులను ఘనంగా సన్మానించారు. పూర్వపు విద్యార్థులంతా కలిసి తమ మిత్రులకు ఆర్థికసాయం చేశారు. పాఠశాల అభివృద్ధి కోసం విరాళం అందజేశారు.

శేషారెడ్డి ఉన్నత పాఠశాలలో..

బేతంచెర్ల: పట్టణంలోని శేషారెడ్డి ఉన్నత పాఠశాలలో శనివారం 1990-91లో పదవ తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన నిర్వహించారు. దాదాపు 34 ఏళ్ల తర్వాత కుటుంబ సమేతంగా కలు సుకున్నారు. అనంతరం గురువులు రామశర్మ, ఆదినారాయణ, హనీఫ్, నాగభూషణం, తిరుపాలయ్యను పూర్వ విద్యార్థులు సన్మానించి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఎంపీపీ బుగ్గ న నాగభూషణం రెడ్డి, బేతంచెర్ల నగర పంచాయతీ చైర్మన్ చలంరెడ్డి, నరసింహనాయుడు, విజయుడు, బాషా, నడిపి హుశేన్, చంద్ర, పూర్వ విద్యార్థినులు అమరావతి, చంద్రకళ, ధనలక్ష్మి, భారతి, నాగేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

'ఆపరేషన్ సిందూర్'పై హర్షం



నంద్యాలలో సంబరాలు చేసుకుంటున్న ప్రజలు



ఆలయంలో పూజలు చేస్తున్న బీజేపీ నాయకులు

నంద్యాల కల్చరల్, మే 10(ఆంధ్రజ్యోతి): పహల్గాంలో అమాయకులైన భారతీయ ప్రజలను ముట్టించిన పాకిస్థాన్ ఉగ్రవాద స్థావరాలపై భారత ప్రభుత్వం 'ఆపరేషన్ సిందూర్' పేరుతో పూర్తిగా సమర్థవంతంగా విజయవంతంగా తుదముట్టించిన సందర్భంగా నంద్యాలలోని గిరినాథ్ సెంటర్‌లో పార్టీలకు, మతాలకు, కులాలకు అతీతంగా సంబరాలు నిర్వహించారు. దేశం కోసం ప్రాణాలు అర్పించిన సైనికులకు నివాళి అర్పించారు. ఈ క్లిష్ట సమయంలో దేశం ముఖ్యం దేశ భద్రత మరియు ప్రజల భద్రత ముఖ్యమని, దేశంలోనే అన్ని పార్టీలు, మతాలు, కులాలు భారత ప్రభుత్వానికి మద్దతుగా నిలిచాయని అన్నారు. ఈ ఆపరేషన్ విజయవంతం కావడానికి త్రివిధ దళాదిపతులు, వారి సైన్యం శక్తి వంచన లేకుండా యుద్ధం చేయడం చాలా గర్వంగా ఉందన్నారు. భారత సైన్యం బార్డర్లో మన కోసం పోరాటం చేస్తున్న వారి వెంట 140 కోట్ల మంది భారతీయులం ఉన్నామని మీ ధైర్యం మా శక్తి, మీ నిబద్ధత మాకు గర్వకారణం, మీపోరాటం మాకు స్ఫూర్తి. సైనికులు కుటుంబాలను కంటికి రెప్పలా కాపాడుకునే బాధ్యత ఈ దేశ ప్రజలపై ఉందన్నారు. మాజీసైనికులు సుంకిరెడ్డి, గురువయ్య, శివారెడ్డి, రామ సుబ్బయ్య, శ్రీనివాసులు, యువరాజ్, ప్రవీణ్ పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు

పాక్ ఉగ్రవాద స్థావరాలను 'ఆపరేషన్ సిందూర్' పేరుతో ధ్వంసం చేయడం హర్షణీయమని అన్నారు. ఈ యుద్ధంలో భారత సైనికులకు, ప్రజలకు ప్రాణ హాని గానీ, ఆస్తి నష్టం కానీ జరగకుండా ఉండాలని నంద్యాల పట్టణంలోని ఆంజేయస్వామి దేవాలయంలో బీజేపీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు రమేష్‌బాబు, జాతీయ కౌన్సిల్ సభ్యులు కృష్ణమూర్తి, అడ్వకేట్ నరసింగరావు, చంద్రశేఖర్, సుధాకర్, డాక్టర్ ఆదినారాయణ, బాలముని, కార్యకర్తలు పాల్గొన్నారు.

వీర జవాన్‌కు ఘన నివాళి



పాణ్యంలో మురళీ నాయక్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న పోలీసులు, మాజీ సైనికులు

పాణ్యం, మే 10 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్‌లో అమరులైన మురళీనాయక్‌కు పాణ్యంలో శనివారం మాజీ సైనికులు నివాళి అర్పించారు. పాణ్యం పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో పాణ్యం సీఐ కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ దేశం కోసం ప్రాణాలర్పించిన వీర జవాన్లను స్మరించుకోవాలన్నారు. ఈసమయంలో ప్రజలు భారత సైనికులకు అండగా ఉండి మానసిక ధైర్యాన్ని అందిచాల్సిన బాధ్యత ఉందన్నారు. ఈసందర్భంగా మురళీనాయక్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ నరేంద్రకుమార్‌రెడ్డి, మాజీ సైనికులు మురారి లక్ష్మన్న, కృష్ణయ్య ఎల్లా కృష్ణయ్య, హుస్సేన్, వెంకటరెడ్డి, చెన్నకేశవులు, కైలాసపతి, సుబ్బరాయుడు, వెంకటాద్రి, ప్రతాప్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

బండిఆత్మకూరు: భారత్, పాకిస్థాన్ యుద్ధంలో వీరమరణం పొందిన తెలుగు బిడ్డ మురళీనాయక్ మృతికి టీడీపీ యూనిట్ ఇన్‌చార్జి తాటికొండ బుగ్గరాముడు, తెలుగుగంగ అభివృద్ధి కమిటీ వైస్ చైర్మన్ కంచర్ల మనోహర్ చౌదరి, ఎ.కోడూరు టీడీపీ నాయకుడు వడ్డు మధుసూదన్‌రెడ్డి వీరజవాన్ మృతికి సంతాపం తెలిపారు. శనివారం వారు మాట్లాడుతూ దేశం కోసం పోరాడిన మురళీ నాయక్ వీరమరణాన్ని తెలుగు జాతి ఎప్పటికీ మరువదని వారు అన్నారు. సైన్యానికి అందరూ అండగా నిలవాలని పిలుపునిచ్చారు.

శ్రీశైలం అభివృద్ధికి కృషి చేయాలి

- మంత్రి ఫరూక్‌ను కోరిన ఎమ్మెల్యే బుడ్డా



మంత్రి ఫరూక్‌తో చర్చిస్తున్న ఎమ్మెల్యే బుడ్డా

నంద్యాల రూరల్, మే 10 (ఆంధ్రజ్యోతి): శ్రీశైల నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్‌ఎండీ ఫరూక్‌ను కోరారు. శనివారం నంద్యాలలోని టీడీపీ కార్యాలయంలో ఆయన మంత్రిని మర్యాద పూర్వకంగా కలిశారు. శ్రీశైలం నియోజకవర్గంలో చేపట్టిన, చేపట్టాల్సిన అభివృద్ధి పనుల గురించి మంత్రికి వివరించారు. తెలుగుగంగ ప్రాజెక్ట్ చైర్మన్ రామలింగారెడ్డి, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ తులసిరెడ్డి తదితరులు ఉన్నారు.

నందికొట్కూరును నందనవనంగా చేస్తాం: ఎంపీ

నందికొట్కూరు, మే 10 (ఆంధ్రజ్యోతి): వచ్చే నాలుగేళ్లలో నందికొట్కూరును నందనవనంగా తయారు చేస్తామని నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు. శనివారం పట్టణంలోని బైరెడ్డి నగర్‌లో నియోజకవర్గ అగ్నిమాపక కేంద్ర నూతన భవన నిర్మాణం కోసం శంకుస్థాపన నంద్యాల ఎంపీ డా.బైరెడ్డి శబరి, నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య, మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి వేరువేరుగా భూమి పూజ చేశారు. ఎంపీ మాట్లాడుతూ తన తండ్రి బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి ఎమ్మెల్యేగా ఉన్నప్పటి నుంచి నందికొట్కూరులో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేయాలన్న కల కలగానే మిగిలిపోయిందన్నారు. ఆయన కల సాకారం చేసేందుకు కేంద్ర ప్రభుత్వంలోని ఎన్‌డీఆర్‌ఎఫ్ నిధులు రూ.2.25కోట్లతో నియోజకవర్గంలో అగ్నిమాపక కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అగ్నిప్రమాదం ఒక్కటే కాదు, ఎలాంటి విపత్తులు వచ్చినా కూడా ఆదుకునేందుకు అత్యాధునిక పరికరాల కోసం మరో రూ.2.21 కోట్లు కూడా మంజూరయ్యాయని చెప్పారు. ఇది చిన్న ప్రాజెక్టు కాదని నియోజకవర్గ ప్రజలను ఆదుకునే ప్రాజెక్టు అని ఆమె అన్నారు. అవిశ్వాస తీర్మానంలో గెలిచిన మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డిని, కౌన్సిలర్లను ఆమె అభినందించారు. పట్టణంలో ఎలాంటి ఘర్షణలకు తావులేకుండా పట్టణ అభివృద్ధిలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని ఆమె సూచించారు. ట్రాఫిక్‌లో ఇరుక్కుపోవడంతో కార్యక్రమానికి ఆలస్యంగా వచ్చానని, ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్మన్‌తో పాటు తాను ఈ కార్యక్రమంలో భాస్వాములం కావడం సంతోషంగా ఉందన్నారు. సివిల్ సప్లైస్ కార్పొరేషన్ డైరెక్టర్ మహేష్ నాయుడు, టీడీపీ నాయకులు నాగేశ్వరరావు, డా.కాకరవాడ చిన్న వెంకటస్వామి, శ్రీనివాసులు, గుణశేఖర్ రెడ్డి, అబ్దుల్ సుకూర్, సాహెబ్ ఖాన్, కౌన్సిలర్లు చాంద్‌బాషా, లాలుప్రసాద్, రావూఫ్, రాధిక, లక్ష్మీదేవి, రూపాదేవి, ప్రాంతీయ అగ్నిమాపకేంద్ర అధికారి భూపాల్‌రెడ్డి, డీఎఫ్‌వో బాలరాజు, రిటైర్డ్ ప్రాంతీయ అధికారి జయన్న తదితరులు పాల్గొన్నారు.

పట్టుబట్టి ఫైర్ స్టేషన్ సాధించాం: ఎమ్మెల్యే

తన ముందు తన తర్వాత నియోజకవర్గం అభివృద్ధిలో తేడా ఏంటో చేసి చూపించాలన్నదే తన లక్ష్యమని నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అన్నారు. అగ్రిమాపక నియోజకవర్గ నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ గెలిచిన మొదటి రోజు నుంచే నందికొట్కూరులో అగ్నిమాపక కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని పట్టుబట్టి ముఖ్యమంత్రి చంద్రబాబు నుంచి అనుమతులు తీసుకున్నామన్నారు. నందికొట్కూరు పట్టణంలో మార్కెట్ యార్డు నుంచి ఆత్మకూరు రోడ్డులోని జమ్మిచెట్టు వరకుని దాదాపు రూ.3 కోట్లతో డివైడర్లు, సెంట్రల్ లైటింగ్‌ను ఏర్పాటు చేసేందుకు అనుమతులు వచ్చాయన్నారు. మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో తీర్మానం చేసుకొని వెంటనే పనులు ప్రారంభిస్తామన్నారు. నందికొట్కూరు మార్కెట్ యార్డు చైర్మన్ వీరం ప్రసాద్‌రెడ్డి, మాండ్ర సురేంద్రనాథ్‌రెడ్డి, యాదవకార్పొరేషన్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు యాదవ్, కౌన్సిలర్ ధర్మారెడ్డి, పట్టన క్లస్టర్ ఇన్‌చార్జి లాయర్ జాకీర్, మిడ్తూరు, పగిడ్యాల మండల కన్వీనర్లు కాతా రమేష్‌రెడ్డి, పలుచానిమహేశ్వరరెడ్డి, నాయకులు వేణుగోపాల్, రవి తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

నందికొట్కూరు, మే 10 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలో పని చేస్తున్న దినసరి పారిశుధ్య కార్మికులు కనీస వేతనం రూ.21 వేలు ఇవ్వాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని సీపీఐ ఎంఎల్ న్యూ డెమొక్రసీ ఆధ్వర్యంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్, ఐఎఫ్‌టీయూ నాయకులు కోరారు. శనివారం పట్టణంలో అగ్నిమాపక కేంద్రం నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపనకు వచ్చిన ఎంపీ బైరెడ్డి శబరి, ఎమ్మెల్యే గిత్తా జయసూర్యకు వినతిపత్రాలు సమర్పించారు. సీపీఐ (ఎంఎల్) న్యూ డెమొక్రసీ జిల్లా కార్యదర్శి నరసింహులు మాట్లాడుతూ మున్సిపాల్టీలో పనిచేస్తున్న పారిశుధ్య దినసరి కూలీలు చాలీచాలని జీతాలతో జీవితాలు వెల్లదీస్తున్నారన్నారు. వారికి కేవలం రూ.9,600 మాత్రమే ఇస్తున్నారని అన్నారు. కార్మికులను ఆప్కాస్ లో చేర్చి కనీస వేతన చట్టం ప్రకారం జీతాలు ఇప్పించాలని కోరారు. కార్మికులు ఎదుర్కొంటున్న పలు రకాల సమస్యలను పరిష్కరించాలని విన్నవించారు. ఐఎఫ్‌టీయూ రాష్ట్ర సహాయకార్యదర్శి అరుణ్ కుమార్, నంద్యాల జిల్లా అధ్యక్షుడు మజీద్ మియా, ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు గోపాల్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు గోవింద్, అశోక్, తిమ్మన్న తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఆలయ వార్షిక వేడుకలు



అభిషేకం కోసం జలాన్ని తీసుకొస్తున్న భక్తులు

నంద్యాల కల్చరల్, మే 10(ఆంధ్రజ్యోతి): నంద్యాల తెలుగుపేటలో వెలసిన ఘణ మద్దిలేటి లక్ష్మీ నృసింహస్వామి ఆలయ సప్తవిశంతి(27)వ వార్షికోత్సవ వేడుకలు శనివారం వైభవంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆలయ నిర్వహకులు మధుసూదన్ రాయల్ ఆధ్వర్యంలో ఉదయం 108 కలశాలతో అంజనేయ స్వామి గుడి వద్ద నుంచి మంగళవాయిద్యాలతో గంగాజలం తీసుకొని వచ్చి స్వామి అమ్మవార్లకు అభిషేక కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు శ్రీరామమూర్తి, భక్తులు పాల్గొన్నారు.

వేడుకలను విజయవంతం చేయాలి

నంద్యాల రూరల్, మే 10 (ఆంధ్రజ్యోతి): నంద్యాల మండలంలోని కొత్తపల్లిలో ఈనెల 12 వతేది నుంచి 14 వరకు మరకతలింగేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు నిర్వహిస్తున్నామని, విజయవంతం చేయాలని రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ లాయర్ తులసిరెడ్డి పిలుపునిచ్చారు. శనివారం ఆయన మాట్లాడుతూ గ్రామంలోని శ్రీదేవి భూదేవి సమేత లక్ష్మీచెన్నకేశవ స్వామి ఆలయ తృతీయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఈభక్తి ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. గ్రామంలో నిర్వహించే యాగాలు, హోమాలు, ప్రతిష్టలు, గ్రామోత్సవాలలో ప్రతి ఒక్కరు పాల్గొనాలని కోరారు.

కనీస వేతనం ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏసురత్నం

నంద్యాల రూరల్, మే 10 (ఆంధ్రజ్యోతి): ఆశా కార్యకర్తలను కార్మికులుగా గుర్తించి కనీస వేతనం రూ 26 వేలు ఇవ్వాలని సిఐటియు అనుబంధ ఆశావర్కర్స్ యూనియన్ అధ్యక్షురాలు నాగమణి డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో నంద్యాల జిల్లా ఆశావర్కర్స్‌తో విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్మికులను యజమానులకు కట్టు బానిసలుగా మార్చే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను పరిరక్షించాలని, ఆశావర్కర్లను కార్మికులుగా గుర్తించాలన్నారు. రూ 26 వేలు జీతం పెంచుతూ జీవోలు విడుదల చేయాలని, చట్టబద్ధమైన సౌకర్యాలు కల్పించాలని కోరారు. డిమాండ్ల సాధనకై కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు ఈనెల20వ తేదిన దేశ వ్యాప్తంగా జరిగే సమ్మెలో ఆశావర్కర్లు అందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈసమావేశంలో జిల్లా గౌరవాధ్యక్షులు ఏసురత్నం, కార్యదర్శి రమణకుమారి తదితరులు పాల్గొన్నారు.

నేడు లక్ష్మీనరసింహ స్వామి జయంతి



నల్లకాల్వ లక్ష్మీనరసింహ స్వామి క్షేత్రం

ఆత్మకూరు, మే 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని నల్లకాల్వ లక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో ఆదివారం స్వామివారి జయంతిని వైభవంగా నిర్వహించేందుకు అన్నిఏర్పాట్లను పూర్తిచేశారు. ప్రధాన అర్చకుడు ఎస్వీ రమణ నేతృత్వంలో స్వామిఅమ్మవార్లకు పంచసూక్తాలతో, పంచామృతాలతో అభిషేకాలు, కుంకుమార్చనలతో పాటు విశేష అలంకరణ నిర్వహించనున్నారు. అదేవిధంగా లక్ష్మీనరసింహస్వామి అమ్మవార్ల కల్యాణ వేడుకలను శాస్త్రోక్తంగా జరపనున్నారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని కూడా ఏర్పాటు చేశారు.

రేపు సత్యనారాయణ స్వామి కల్యాణం

నంద్యాల కల్చరల్, మే 10(ఆంధ్రజ్యోతి): నంద్యాల కోట వీధిలో వెలసిన రమాసమేత సత్యనారాయణ స్వామి ఆలయంలో సోమవారం ఉదయం సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం అనంతరం కల్యాణం నిర్వహించడానికి ఏర్పాట్లుచేశారు. పల్లకీ ఉత్సవం వెంట కోలాట నృత్యప్రదర్శన, చెక్కభజన, భరతనాట్యం వేసుకుంటూ నగర వీధుల గుండా గ్రామోత్సవం నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. ఇందులో భాగంగా శనివారం స్వామి, అమ్మవార్లకు పెళ్లి కుమారుడు, పెళ్లి కుమార్తె కార్యక్రమం నిర్వహించారు. ముందుగా స్వామివార్ల కల్యాణ వేడుకల ఆహ్వాన పత్రికను విడుదల చేశారు. అర్చకులు ప్రసన్న కుమార్, భక్తులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ప్రత్యేక ఆధార్ క్యాంపులు

నంద్యాల టౌన్, మే 10 (ఆంధ్రజ్యోతి): ఈనెల 12వ తేదీ నుంచి 15 వరకు ఆరేళ్లలోపు పిల్లలకు ఆధార్ స్పెషల్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు పురపాలక కమిషనర్ నిరంజన్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ బర్త్ సర్టిఫికెట్ ఉండి ఆధార్ కార్డు లేని వారు జిల్లాలో 2,659 మంది ఉన్నారని తెలిపారు. జిల్లాలో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్న సందర్భంగా నంద్యాల పట్టణంలో నాలుగు విభాగాలుగా విభజించి ఆధార్ స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఏకలవ్య నగర్, విద్యానగర్, వైఎస్సార్ నగర్, రామనాథరెడ్డి నగర్‌లో ఈ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

జూపాడుబంగ్లా: మండలంలో సోమవారం నుంచి ప్రత్యేక ఆధార్ నమోదు క్యాంపులు ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీవో గోపికృష్ణ తెలిపారు. ఈనెల 12, 13 తేదీల్లో తంగడంచ, తరిగోపుల, 14న తర్తూరు, జూపాడుబంగ్లా, 15న మండ్లెం, జూపాడు బంగ్లా గ్రామాల్లోని సచివాలయాల వద్ద కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

15న మండల సర్వసభ్య సమావేశం

ఆత్మకూరు, మే 10(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం నందు ఈ నెల 15వ తేదీన మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సుబ్రమణ్యం శనివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. ప్రతి మూడు నెలలకు ఓ సారి జరిగే సర్వసభ్య సమావేశంలో భాగంగా శనివారం ఉదయం 11గంటలకు ఎంపీపీ తిరుపాలమ్మ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి జడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ఆయా శాఖల అధికారులు హాజరు కావాలని కోరారు. ప్రత్యేకించి అధికారులు తమ శాఖ ప్రగతి నివేదికలతో హాజరు కావాలని సూచించారు.

ఘనంగా వేళాంగిణి పండుగ



నందికొట్కూరులో ప్రార్థన చేస్తున్న బిషప్



హాజరైన క్రైస్తవులు

నందికొట్కూరు, మే 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో వెలసిన వేళాంగిణి మహోత్సవాలు ఆర్సీఎం విచారణ గురువు కేడీ జోసెఫ్ ఆధ్వర్యంలో ఘనంగా ముగిశాయి. ఈ మహోత్సవాలకు ముఖ్య అతిథిగా కడప బిషపు మహాగణ సగినాల పాల్ ప్రకాష్ హాజరయ్యారు. శనివారం సాయంత్రం నూతన బిషప్‌ను భారీ ఊరేగింపుతో ఘన స్వాగతం పలికారు. బిషప్ దివ్య బలిపూజను సమర్పిస్తూ వాక్య పరిచర్య చేశారు. బిషప్ అయిన తర్వాత మొదటిసారిగా తాను ఇక్కడికి రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఉదయం నుంచే ప్రజలు ప్రత్యేకంగా ప్రార్థనల్లో పాల్గొన్నారు. గురువులు అధిక సంఖ్యలో క్రైస్తవులు పాల్గొన్నారు.

కమనీయం.. చెన్నకేశవస్వామి కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న పండితులు

మిడుతూరు, మే 10(ఆంధ్రజ్యోతి): మిడుతూరు గ్రామంలోని లక్ష్మీచెన్నకేశవ స్వామి తిరునాళ్ల సందర్భంగా శనివారం లక్ష్మీచెన్నకేశవ స్వామి, శ్రీదేవి భూదేవి అమ్మవార్ల కల్యాణం ఈవో వెంకట రమణ ఆధ్వర్యంలో నిర్వహించారు. దేవదాయశాఖ అధికారులు, గ్రామ పెద్దలు, భక్తులు చెన్నకేశవుడి, శ్రీదేవి, భూదేవి తలలపై తలంబ్రాలను పోశారు. మంగళ వాయిద్యాలు, వేద మంత్రోచ్ఛరణాల మధ్య జరిగిన ఈ కల్యాణాన్ని తిలకించడానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. కల్యాణం అనంతరం తీర్థ ప్రసాదాలను స్వీరించారు. ఉదయం చెన్నకేశవస్వామి శ్రీదేవి, భూదేవి సమేతుడై శేషవాహనంపై గ్రామంలో ఊరేగింపుగా భక్తులకు దర్శనమిచ్చాడు, సాయంత్రం హనుమంతుడి వాహనంగా చేసుకుని గ్రామంలో భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో రాములురెడ్డి, రమేష్‌రెడ్డి, రాజారెడ్డి, నాగిరెడ్డి, చంద్రారెడ్డి, సేవా కమిటీ మెంబరు కృష్ణమోహన్‌రావు, రామ్మోహన్ తదితర గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

మహానందీశ్వరుడి సన్నిధిలో గుంతకల్లు రైల్వే డివిజన్ మేనేజర్



మహానంది క్షేత్రంలో గుంతకల్లు రైల్వే మేనేజర్ చంద్రశేఖర్‌గుప్తా

మహానంది, మే 10 (ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలో గుంతకల్లు డివిజన్ రైల్వే మేనేజర్ చంద్రశేఖర్ గుప్తా దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం ఆలయ ముఖ మంటపం వద్ద వీరికి ఆలయ ఏఈవో యర్రమల్ల మధు ఆధ్వర్యంలో అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం ప్రధాన ఆలయాల్లో మహానందీశ్వరుడికి, కామేశ్వరీదేవి అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకార్చన పూజలను జరిపారు. అలంకార మంటపంలో వీరిని వేదపండితులు నాగేశ్వరశర్మ ఆశీర్వదించారు. ఏఈవో శాలువాతో సన్మానించి, ప్రసాదాలు అందజేశారు. టెంపుల్ ఇన్‌స్పెక్టర్ నాగమల్లయ్య, రైల్వే సిబ్బంది ఉన్నారు.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి



జెండాను ఆవిష్కరిస్తున్న సీపీఐ ఎంఎల్ లిబరేషన్ నాయకులు

జూపాడుబంగ్లా, మే 10 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం కార్మికులపట్ల అవలంబిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 20న చేపట్టే దేశవ్యాప్త సమ్మెను కార్మికులు విజయవంతం చేయాలని సీపీఐ ఎంఎల్ లిబరేషన్‌జిల్లా నాయకులు వెంకటేశ్వర్లు, గాబ్రియల్ పిలుపు నిచ్చారు. జూపాడుబంగ్లాలో శనివారం మండల నాయకుల సమావేశం నరసింహ అధ్యక్షతన జరిగింది. మేడే సందర్భంగా జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. కార్మికులను కట్టుబానిసలుగా మార్చే 4 కార్మిక కోడ్‌లను వెంటనే రద్దుచేయాలని డిమాండ్ చేశారు. ఎన్నో త్యాగాల ఫలితంగా సాధించుకున్న 44 కార్మిక చట్టాలను యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. కేంద్రప్రభుత్వం కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను మానుకోవాలని, లేకపోతే పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏసన్న, సుబ్బరాజు, సోమప్ప, అన్వర్‌బాషా, మాబాసా, తిమ్మప్ప, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అన్యాయం జరిగితే సహించం: లబ్బి



సోలార్ సిబ్బందితో మాట్లాడుతున్న లబ్బి వెంకటస్వామి

మిడుతూరు, మే 10 (ఆంధ్రజ్యోతి): పైపాలెం గ్రామ గట్టుపై ఏర్పాటు చేస్తున్న సోలార్ ఏర్పాటు వల్ల రైతులకు నష్టం జరుగుతుందని, వారికి అన్యాయం జరిగితే సహించేది లేదని మాజీ ఎమ్మెల్యే లబ్బి వెంకటస్వామి అన్నారు. పైపాలెం గ్రామంలో సోలార్ పనులు జరుగుతున్న ప్రదేశానికి ఆయన చేరుకుని సోలార్ అధికారులతో, తహసీల్దార్ శ్రీనివాసులుతో, రైతులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వెంకటస్వామి మాట్లాడుతూ సోలార్‌కు భూములు ఇచ్చిన 20 వేల కుటుంబాలకు ఒకరికి 300 యూనిట్లు కరెంటు ఉచితంగా ఇవ్వాలని ఆయన డిమాండు చేశారు. వెంకటస్వామి ఆర్డీవో నాగజ్యోతితో ఫోన్‌లో మాట్లాడి ఈ విషయాన్ని కలెక్టరు దృష్టికి తీసుకెళ్లి రైతుల సమస్యలను పరిస్కరించాలని కోరారు. సోలార్ పనుల వల్ల రైతుల పొలాలకు వెళ్ల రహదారులు, నీటి కుంటలు, పొలాల గెట్లు తొలగించడం వల్ల రైతులు తీవ్ర నష్టం వాటిల్లుతున్నదని పైపాలెం గ్రామ పెద్దలు, ప్రజలు, సీపీఎం నాయకులు నాగేశ్వర రావు, పక్కీర్ సాహెబ్ ఆధ్వర్యంలో సోలార్ పనులను అడ్డుకున్నారు. సోలార్ ప్రదేశంలో గొడవలు జరగకుండా ఎస్‌ఐ ఓబులేసు పోలీసు సిబ్బంది బందోబస్తు ఏర్పాటు చేశారు.

జీజీహెచ్‌లో నిరుపయోగంగా యంత్రాలు

నంద్యాల హాస్పిటల్, మే 10(ఆంధ్రజ్యోతి): నంద్యాల జీజీహెచ్‌లోని బ్లడ్ బ్యాంకులో కాంపోనెంట్ యంత్రం లేకపోవడంతో లక్షల రూపాయలు విలువ చేసే రక్తనిల్వ యంత్రాలు నిరుపయోగంగా ఉన్నాయి. రక్తంలోని ఎర్ర రక్త కణాలు, తెల్లరక్త కణాలు, ప్లాస్మా, ప్లేట్ లేట్లు వేరుగా చేసే కాంపోనెంట్ యంత్రం లేకపోవడంతో ప్రజలు ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రి జీజీహెచ్‌గా స్థాయి పెరిగినప్పటికి నుంచి కాంపొనెంట్ మిషన్ లేక ప్రజలు అవస్థలు పడుతున్నారు. రక్త కణాలను నిల్వ ఉంచే 3 యంత్రాలు ఉన్నప్పటికీ అవసరమైన సుమారు రూ.25 లక్షలు విలువ చేసే కాంపోనెంట్ యంత్రం కొనుగోలు చేయకపోవడంతో అధికారుల నిర్లక్ష్యం ఏమేరకు ఉందో తెలుస్తుంది. ఆసుపత్రి స్థాయిని పెంచారే కానీ అవసరమైన పరికరాలు ఏర్పాటు చేయలేకపోవడం విడ్డూరంగా ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాంపోనెంట్ యంత్రం ఏర్పాటు చేసి రక్త కణాలను నిల్వ చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉంది. కలెక్టర్ స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. బ్లడ్ బ్యాంకు హెచ్‌వోడీ డాక్టర్ బాలీశ్వరిని వివరణ కోరగా రెండు నెలల క్రితం యంత్రం కొనుగోలు చేసిన లేఖ వచ్చింది. ఏసీ, యంత్రం ఉంచడానికి యంత్రం తదితరు ఏర్పాట్లు చేయాలని ఏపీఎంఎస్‌ఐడీసీ వారు సూచించారన్నారు. ఈ విషయం ఏడీ దృష్టికి తీసుకెళ్లానని చెప్పారు. త్వరలో యంత్రం జీజీహెచ్‌కు వస్తుందని చెప్పారు.



బ్లడ్ బ్యాంకులో నిరుపయోగంగా ఉన్న యంత్రాలు, పరికరాలు

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

సమష్టి కృషితోనే అభివృద్ధి : డీఎం


ఆర్టీసీ ఉద్యోగికి ప్రశంసాపత్రం అందజేస్తున్న డిపో మేనేజర్ శశిభూషణ్

డోన్ టౌన్, మే 10 (ఆంధ్రజ్యోతి): సమష్టి కృషితోనే డిపో అభివృద్ధి సాధ్యమని డిపో మేనేజర్ శశిభూషణ్ అన్నారు. శనివారం స్థానిక ఏపీ ఎస్ఆర్టీసీ డిపో ఆదర్శ ఉద్యోగులకు అభినందన సభ నిర్వహించారు. ఆదర్శ ఉద్యోగులుగా ఎంపికైన ఉద్యోగులకు ప్రశంసాపత్రాలతో పాటు ప్రోత్సాహక బహుమతులను డిపో మేనేజర్ శశిభూషణ్ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరూ కలిసికట్టుగా డిపో అభివృద్ధికి పాటు పడాలని కోరారు. ఆదర్శ ఉద్యోగులుగా ఎంపికైన ఉద్యోగులు శ్రీరాములు, ఆర్బీ దేవేంద్రుడు, ఎస్.రసూల్, ఎస్ఎం వలి, ఐవీఆర్ రెడ్డి, ఎస్.శ్రీరాముడు, బి.చంద్రమోహన్, పి.బాల సుంకన్నలను డిపో మేనేజర్ అభినందించారు. కార్యక్రమంలో డిపో ట్రాఫిక్ ఇన్‌చార్జి మోజెస్, గ్యారేజ్ సూపర్‌వైజర్ రామగోపాల్, యూనియన్ నాయకులు దాసు, మెకానిక్ సీతారామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు బీసీ రాజారెడ్డి పెళ్లి కానుకలు


పెళ్లి కానుకలను పంపిణీ చేస్తున్న మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి

బనగానపల్లె, మే 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బీసీ రాజారెడ్డి కార్యాలయంలో శనివారం పేదలకు పెళ్లి కానుకలు మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి పంపిణీ చేశారు. సంజామల మండలం రెడ్డిపల్లె, బనగానపల్లె మండలం యాగంటిపల్లెకు చెందిన పేద వారికి పెళ్లి కానుకలను ఆయన అందజేశారు. కార్యక్రమంలో శంఖేశ్వరరెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సుబ్బారెడ్డికి గన్‌మెన్ల కేటాయింపు

డోన్ రూరల్, మే 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డికి గన్‌మెన్లు కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో భాగంగా శనివారం ధర్మవరం సుబ్బారెడ్డికి ఇద్దరు 1+1 కేటగిరిలో గన్‌మెన్లు నియమించా రు. శనివారం గన్‌మెన్లు విధులకు హాజరై సుబ్బారెడ్డికి రక్షణ కల్పిస్తూ విధుల్లో చేరారు. గన్‌మెన్లు కేటాయింపుపై ఆయన అభిమానులు హర్షం వ్యక్తం చేశారు.

డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభం

బనగానపల్లె, మే 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2025-26 సంవత్సరానికి ప్రథమ సంవత్సరం డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలకు అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని కళాశాల ప్రిన్సిపాల్ లలిత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు కళాశాలకు వచ్చి దరఖాస్తు ఫారాలు తీసుకోవాలని సూచించారు. ప్రతిరోజు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం ఐదుగంటల వరకు కళాశాల తెరిచే ఉంటుందని పేర్కొన్నారు.

జేసీ ప్రభాకర్‌రెడ్డితో మంత్రి బీసీ భేటీ


జేసీతో మాట్లాడుతున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

బనగానపల్లె, మే 10 (ఆంధ్రజ్యోతి): తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి, తాడిపత్రి ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డితో రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి శని వారం భేటీ అయ్యారు. జేసీ గృహానికి చేరుకొని వారిని మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, తాడిపత్రి నియోజకర్గంలో రోడ్ల అభివృద్ధిపై బీసీతో వారు చర్చించారు. తాడిపత్రి నియోజకవర్గంలో రోడ్ల అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తామని మంత్రి వారికి హామీఇచ్చారు. టీడీపీ నాయకుడు మూలే రామేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

తాగునీటి సమస్యపై ప్రత్యేక చర్యలు

కొలిమిగుండ్ల: ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తాగునీటి సమస్యలపై ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి బీసీ జ నార్దన్‌రెడ్డి అన్నారు. శనివారం మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి తాడిపత్రికి వెళ్తూ కనకాద్రిపల్లె గ్రామంలో ట్యాంకు వద్ద తాగునీటిని పట్టుకుంటున్న స్థానికులతో మాట్లాడారు. గత ఏడాది నెలకొన్న వర్షాభావ పరిస్థితుల వలనే తాగునీటి సమస్యలు ఏర్పడుతున్నాయని మంత్రి బీసీ అన్నారు. ఎప్పటికప్పుడు అధికారులతో మాట్లాడుతూ తాగునీటి సమస్యలపై సమీక్షలు నిర్వహిస్తూ, చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. తాగునీటి సరఫరాలో ఎటువంటి అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటామని మంత్రి అన్నారు.

ఆలయాభివృద్ధికి కృషి చేస్తా : బిజ్జం


ఆలయంలో పూజలు చేస్తున్న బిజ్జం పార్థసారథిరెడ్డి

అవుకు , మే 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్రమలకొండల్లో వెలసిన శ్రీలక్ష్మీకంబగిరి స్వామి ఆలయాభివృద్ధికి కృషిచేస్తామని పాణ్యం మాజీ ఎమ్మెల్యే బిజ్జం పార్థసారథిరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని కునుకుంట్ల టీడీపీ నాయకులు గూడాల ప్రతాప్‌రెడ్డి, మురళీధర్‌రెడ్డితో కలసి కంబగిరిస్వామి ఆలయానికి చేరుకొని ప్రత్యేక పూజలుచేశారు. స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు బిజ్జంతో పాటు గూడాల సోదరులను శాలువాలు కప్పి సత్కరించి తీర్థ ప్రసాదాలు అందిచారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం

చాగలమర్రి, మే 10 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయం రైతులకు లాభదాయకమని ప్రకృతి వ్యవసాయ యూనిట్ అధికారి నిరంజన్ తెలిపారు. శనివారం కదిరిపురంలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం గ్రామసభలో ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం సాగుతో కలిగే లాభాలను తెలిపారు. ఐసీఆర్పీలు బాబు, సురేష్, బాష, లక్ష్మీనర్సమ్మ, రవి, రైతులు పాల్గొన్నారు.

చెంతనే చెరువులు.. చింతలో రైతులు

- చివరి ఆయకట్టుకు అందని నీరు
- మరమ్మతుల నిధులకు గ్రహణం

చాగలమర్రి, మే 10(ఆంధ్రజ్యోతి): చెంతనే చెరువులున్నా రైతులకు చింత తీరడం లేదు. ప్రతి ఏడాది చెరువుల ద్వారాసాగునీరు అందక రైతులు ఆందోళన చెందుతున్నారు. పంట కాలువలు లేక రైతులు పంట పొలాలను బీళ్లుగా పెట్టుకుంటున్నారు. ఉపాధిహామీ నిధులతో నామమాత్రంగా పనులు చేసి వదిలేస్తున్నారు. 2022-23 సంవత్సరంలో అమృతసరోవర్ పథకం కింద మంజూరైన నిధులతో చెరువు పూడికతీత పనులు చేశారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో నిధులు మంజూరు కాకపోవడంతో పనులు చేపట్టకుండా వదిలేశారు. కేవలం ప్రతిపాదనలతోనే సరిపెట్టారు.

నామమాత్రం పనులు

ఆళ్లగడ్డ, రుద్రవరం, శిరివెళ్ల, చాగలమర్రి, ఉయ్యాలవాడ, కొలిమిగుండ్ల, సంజామల, వెలుగోడు, ఆత్మకూరు, కొత్తపల్లె, జూపాడుబంగ్ల, మిడ్తూరు మండలాల్లో 31,243 హెక్టార్ల ఆయకట్టు ఉంది. 2018-19లో చెరువుల మరమ్మతులకు రూ.5 కోట్లు నిధులు మంజూరు చేశారు. ఈ నిధులతో ముత్యాలపాడు చెరువుకు రూ.4 కోట్లు, డి.వనిపెంట చెరువు అలుగు మరమ్మతులకు రూ.కోటి పనులు చేశారు. నామమాత్రంగా పనులు చేశారన్న విమర్శలు ఉన్నాయి.


మరమ్మతులకు నోచుకోని డి.వనిపెంట చెరువు


ముత్యాలపాడులో ముళ్ల కంపలతో నిండుకున్న పంట కాలువ

శిథిలావస్థలో పంట కాలువలు

నంద్యాల జిల్లా పరిధిలో చెరువుల కింద పంట కాలువలు శిథిలావస్థకు చేరుకున్నాయి. ఆళ్లగడ్డ నియోజకవర్గ పరిధిలో 29 చెరువులు ఉన్నాయి. ఈ చెరువుల కింద పంట కాలువలు, తూములు సరిగా లేకపోవడంతో ఆయకట్టు రైతులకు సాగునీరు అందక ఇబ్బందులు పడుతున్నారు.

అమృతసరోవర్ నిధులు దుర్వినియోగం

చాగలమర్రి మండలంలోని ముత్యాలపాడు, తిప్పనపల్లె చెరువుల్లో 2022-23 సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన అమృతసరోవర్ పథకం ద్వారా ఉపాధి కూలీలచే చెరువు మరమ్మతు పనులు చేశారు. చెరువుల్లో పూడికతీత, రబ్బరు చెట్ల తొలగింపు సక్రమంగా చేయలేదన్న విమర్శలు ఉన్నాయి. ముత్యాలపాడు చెరువు రూ.8.43 లక్షలు ఖర్చు చేశారు. తిప్పనపల్లె చెరువు కింద రూ.3.70 లక్షలు ఖర్చు చేసి చెరువు పూడికతీత పనులు చేశారు. నామమాత్రంగా కూలీలచే పనులు చేయించి నిధులు దుర్వినియోగం చేశారన్న విమర్శలు ఉన్నాయి. ఈ పనులపై అధికారులు విచారణ చేపడితే వాస్తవాలు వెలుగులోకి వస్తాయి.

ఎలాంటి అవకతవకలు లేవు

కూలీల మస్టర్‌లో కూడా చేతివాటం ప్రదర్శించారన్న విమర్శలు ఉన్నాయి. ఈవిషయంపై ఏపీవో నిర్మలను వివరణ కోరగా అమృత సరోవర్ నిధులతో రెండు చెరువుల్లో ఉపాధి కూలీలచే పూడికతీత పనులు చేయించాం. మస్టర్ల నిర్వహణలో ఎలాంటి అవకతవకలు లేవని పేర్కొన్నారు. పనులకు వచ్చిన కూలీలకు మాత్రమే మస్టర్లు వేశామన్నారు.

ప్రతిపాదనలు పంపాం

చెరువులు, పంట కాలువల మరమ్మతులకు ప్రతిపాదనలు పంపాం. చింతలచెరువు పంట కాలువ పనులకు ట్రిబుల్‌ఆర్ స్కీమ్ కింద రూ.2 కోట్లు, డి.వనిపెంట చెరువు కింద పంట కాలువలకు రూ.2 కోట్లు, ముత్యాలపాడు పంట కాలువల మరమ్మతులకు రూ.60 లక్షలు చిన్నవంగలి మల్లారెడ్డి కుంట మరమ్మతులకు రూ.90 లక్షలు నిధులతో ప్రతిపాదనలు చేశాం. నిధులు మంజూరైన వెంటనే పనులు చేపడతాం.

- రాంప్రసాద్, ఏఈ, మైనర్ ఇరిగేషన్, ఆళ్లగడ్డ

ముగిసిన ఆలయ ప్రతిష్ఠోత్సవాలు

ఉయ్యాలవాడ, మే 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోవిందపల్లె గ్రామంలో మూడు రోజులుగా జరుగుతున్న ఉమామహేశ్వర స్వామి పునఃప్రతిష్ఠా మహోత్సవం శనివారంతో ముగిసింది. ఉదయం 9 గంటలకు శృంగేరి శివగంగా పీఠాధిపతి పురుషోత్తమ్మ భారతీ ఆధ్వర్యంలో ప్రధాన అర్చకుడు దక్షిణామూర్తి బృందం నూతన విగ్రహాన్ని ప్రతిష్ఠించి, ప్రాణ ప్రతిష్ఠ చేశారు. అనంతరం శివ పార్వతులకు కల్యాణం చేశారు. భక్తులను ఉద్దేశించి పీఠాధిపతి ప్రవచనాలు చెప్పారు.


స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

ప్రముఖుల పూజలు..

గ్రామంలో జరుగుతున్న ఉమామమహేశ్వర స్వామి పునఃప్రతిష్ఠోత్సవాల్లో నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి, తెలంగాణ రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు పాల్గొన్నారు. గ్రామానికి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త చామల చంద్రశేఖర్‌రెడ్డి, సర్పంచ్ ఉమాదేవి ఆహ్వానం మేరకు మంత్రి శ్రీధర్‌బాబు గ్రామానికి చేరుకొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు.

బహుమతులు ప్రదానం

గ్రామంలో నిర్వహించిన బండలాగుడు పోటీల్లో ప్రతిభ కనపరచిన వృషభాల యజమానులకు కమిటీ సభ్యులు నగదు బహుమతులు అందజేశారు. పోటీల్లో 19 జతల వృషభాలు పాల్గొన్నాయి. బాపట్ల జిల్లా వేటపాలెం గ్రామానికి చెందిన శిరీష చౌదరి, శివక్రిష్ణ చౌదరిల ఎద్దులు మొదటి బహుమతిగా రూ. 80వేలు సాధించా యి. నంద్యాల జిల్లా, పెద్దకొట్టాల గ్రామా నికి చెందిన బోరెడ్డి కేశవరెడ్డి ఎద్దుల రెం డవ బహుమతిగా రూ. 70వేలు, నాగర్‌కర్నూలు జిల్లాకు చెందిన వెంకటేశ్వరరావు ఎద్దులు మూడవ, కర్నూలు జిల్లా, రేమట గ్రామానికి చెందిన చిన్న గిడ్డయ్య నాయు డు ఎద్దులు నాలుగవ, గుంటూరు జిల్లా, కొప్పురావూరు గ్రామానికి చెందిన తోట శ్రీ నివాసరావు ఎద్దులు ఐదవ బహుమతి సాధించారు. వీరికి కమిటీ సభ్యులు పేరెడ్డి మోహన్‌రెడ్డి, ఆరికట్ల శివారెడ్డి, గడ్డం దస్తగిరిరెడ్డి, బోరెడ్డి నర్శిరెడ్డి తదితరులు కలిసి బహుమతులు అందించారు.


భక్తులను ఉద్దేశించి ప్రవచిస్తున్న పీఠాధిపతి పురుషోత్తమ భారతీ


పూజల్లో పాల్గొన్న తెలంగాణ ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు

కమనీయం.. విఠలేశ్వరస్వామి కల్యాణం

కోవెలకుంట్ల, మే 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాండురంగ విఠలేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ఆలయ కమిటీ చైర్మన్ గుద్దేటి గుండయ్య ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. శనివారం తెల్లవారు జామున శ్రీదేవి భూదేవి సమిత పాండురంగ విఠలేశ్వరస్వామి ఉత్సవ మూర్తులకు వేదపండితులు వేణు గోపాలచారి, సుదర్శనాచారి కల్యాణం జరిపించారు. కార్యక్రమం లో పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు పెండేకంటి సుబ్రమణ్యం, మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ గడ్డం నాగేశ్వర్‌రెడ్డి, పాండురంగ విఠలేశ్వర స్వామి ఆలయ కమిటి సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.


కోవెలకుంట్లలో స్వామి కల్యాణాన్ని నిర్వహిస్తున్న అర్చకులు


సంజామల మండలం పేరుసోమలలో..

విష్ణుకంటి క్షేత్రంలో...

సంజామల: పేరుసోమలలోని విష్ణుకంటి క్షేత్రంలో వెలిసిన కంబగిరి స్వామి వారి కల్యాణం కమనీయంగా సాగింది. ముఖ్య అతిథిగా పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి హాజరయ్యారు. స్వామి వారి కళ్యాణాన్ని తిలకించేందుకు నంద్యాల, కడప జిల్లాల నుండి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. భక్తులకు అన్నదానం చేశారు. వేద పండితులు శ్రీనివాసచార్యులు, రామ్మోహన్‌స్వామి, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

ఘనంగా లక్ష్మి మద్దిలేటి స్వామి తిరునాళ్ల

- ప్రత్యేక పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ


పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే సుజాతమ్మ

డోన్ రూరల్, మే 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కనపకుంట గ్రామంలో శనివారం లక్ష్మి మద్దిలేటి స్వామి తిరునాళ్ల మహోత్సవాలు వైభవంగా జరిగాయి. ప్రత్యేక పూజ కార్యక్రమంలో డోన్ మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ పాల్గొన్నారు. ఎమ్మెల్యే పూజల నిర్వహించిన అనంతరం అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆమె వెంట టీడీపీ సీనియర్ నాయకులు లక్కసాగరం లక్ష్మిరెడ్డి, టీడీపీ పట్టణ నాయకులు ఓంప్రకాష్ తదితరులున్నారు.

హోరాహోరీగా బండలాగుడు పోటీలు

మండలంలోని కనపకుంట గ్రామంలో లక్ష్మి మద్దిలేటిస్వామి తిరునాళ్లను పురస్కరించుకుని గ్రామ పెద్దల ఆధ్వర్యంలో అంతరాష్ట్ర బండలాగుడు పోటీలు జరిగాయి. వివిధ జిల్లాల నుంచి వచ్చిన న్యూ కేటగిరి ఎద్దులు బండలాగుడు పోటీలను డీసీఎంఎస్ మాజీ చైర్మన్ లక్కసాగరం లక్ష్మిరెడ్డి, టీడీపీ నాయకులు కనపకుంట మధుసూదన్ రెడ్డి ప్రారంభించారు. గెలుపొందిన వృషభాల యజమానులకు గ్రామ పెద్దల ఆధ్వర్యంలో నగదు బహుమతులు వరుసగా రూ.60వేలు , రూ.40వేలు, రూ.25వేలు, రూ.15వేలు, రూ.10వేలు నగదు బహుమతులను దాతలు అందజేశారు.

డిప్యూటీ సీఎంకు వినతి పత్రం అందజేత


డిప్యూటీ సీఎంకు వినతి పత్రాన్ని ఇస్తున్న ఎమ్మెల్యే అఖిలప్రియ

ఆళ్లగడ్డ, మే 6 (ఆంధ్రజ్యోతి): అమరా వతిలో డిప్యూటీ సీఎం పవ న్ కళ్యాణ్‌ను ఎమ్మెల్యే భూ మా అఖిల ప్రియ శనివా రం కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఆళ్లగడ్డ నియోజకవర్గం అభివృద్ధికి పంచాయతీ రాజ్ నిధులు మంజూరు చేయించాలని కోరా రు. ఇందుకు ఆయన స్పం దించి అభివృద్ధికి సహకరి స్తామని చెప్పినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

రైల్వే గేట్‌మన్‌పై దాడి

డోన్ టౌన్, మే 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాతపేట సమీపాన ఉన్న కర్నూలు రైల్వే గేట్‌మన్ వెంకటేష్‌పై దాడి చేశారు. ఈ ఘటన శనివారం చోటు చేసుకుంది. రైల్వేగేటును తాము వెళ్లే టప్పుడు వేస్తావా అంటూ పవన్ కుమార్ అనే వ్యక్తి గేట్‌మన్ వెం కటేష్‌తో వాదనకు దిగాడు. అనంతరం దాడి చేశాడు. దాంతో అతడికి గాయాలు అయ్యాయి. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. బాధితుడు వెంకటేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు జీఆర్‌పీ ఎస్‌ఐ బిందుమాధవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

క్రీడాకారులకు పౌష్టికాహారం పంపిణీ

ఆళ్లగడ్డ, మే 10(ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డలోని ప్రభుత్వ కళాశాల క్రీడా మైదానంలో ఆర్ఆర్ అకాడమీ ఆధ్వర్యంలో శిక్షణ పొందుతున్న క్రీడాకారులకు శనివారం కానిస్టేబుల్ కోటేశ్వరరావు, గురుప్రసాద్ పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో కోచ్ సుబ్బారాయుడు, శేషు, పనీంద్రా, ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

సింహవాహనంపై చెన్నకేశవస్వామి


చెన్నకేశవ ఉత్సవమూర్తుల ఊరేగింపు

చాగలమర్రి, మే 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెల్లాల క్షేత్రంలో చెన్నకేశవ, సంజీవ రాయ, భీమలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా శనివారం సింహ వాహనసేవ వైభవంగా నిర్వహించారు. చెన్నకేశవ ఉత్సవమూర్తులను గ్రామోత్సవం చేశారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. కార్యక్రమంలో ఈవో వెంకటరమణ, కమిటీ సభ్యులు లక్ష్మీనారాయణరెడ్డి, నరసింహారెడ్డి, ఆలయ ఉద్యోగులు, ప్రధాన అర్చకులు, మహిళలు పాల్గొన్నారు.

'మురళీనాయక్ మరణం బాధాకరం'

చాగలమర్రి, మే 10 (ఆంధ్రజ్యోతి): భారత్, పాకిస్థాన్ మధ్య జరుగుతున్న యుద్ధంలో జవాన్ మురళీనాయక్ మృతి చెందడం బాధాకరమని బీసీ సంఘం మండల అధ్యక్షుడు లక్ష్మీనారాయణగౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం బీసీ సంఘ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఉగ్రవాదానికి ప్రతీకారంగా చేపట్టిన ఆపరేషన్ సిందూర్ కార్యక్రమానికి ప్రతి భారతీయుడు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో బీసీ సంఘ నాయకులు రామతీర్థం, పీరయ్య, సుబ్బరాయుడు, సిద్దయ్య, లాలయ్య, చిన్నికృష్ణయ్య పాల్గొన్నారు.

రూ.4.97 లక్షలతో ఆర్వో ప్లాంట్

చాగలమర్రి, మే 10 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని బాలికోన్నత పాఠశాలలో బాలికలకు శుద్ధజల నీరు అందించేందుకు పీఎంశ్రీ ద్వారా ఆర్వో ప్లాంట్ మంజూరైనట్లు హెచ్ఎం విజయలక్ష్మి శనివారం తెలిపారు. గతంలో ఉన్న ఆర్వో ప్లాంట్ పని చేయకపోవడంతో కొత్త ఆర్వో ప్లాంట్‌ను మంజూరు చేశారని అన్నారు. రూ.4.97 లక్షలు విలువ చేసే ఆర్వో ప్లాంట్‌ను సరఫరా చేశారని తెలిపారు. ఆర్వో ప్లాంట్ పనులు చేపట్టి పాఠశాల తెరిచే నాటికి బాలికలకు తాగునీరు అందేలా చూస్తామని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ హుసేన్ సాబ్ పాల్గొన్నారు.

నేడు రాష్ట్రస్థాయి రాతిదూలం పోటీలు

చాగలమర్రి, మే 10 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఇడమడక గ్రామంలో గంగ జాతర సందర్భంగా ఆదివారం రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో గెలుపొందిన వృషభరాజములకు మొదటి బహుమతి రూ.65వేలు, వరుసగా రూ.50వేలు, రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.8 వేలు, రూ.5 వేలు నగదు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. పోటీలను విజయవంతం చేయాలని కోరారు.

అసంపూర్తి పనులను పూర్తి చేస్తున్నాం: డీఈ


పనులను పరిశీలిస్తున్న ఆర్అండ్‌బీ డీఈ సుబ్బరాయుడు

రుద్రవరం, మే 10 (ఆంధ్రజ్యోతి) : నంద్యాల డివిజన్‌లో అసంపూర్తిగా ఉన్న ఆర్అండ్‌బీ రోడ్డు పనులను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు డీఈ సుబ్బరాయుడు అన్నారు. శనివారం రుద్రవరంలో ఆర్అండ్‌బీ రోడ్డు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకు రోడ్డు నిర్మాణం చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో ఏఈలు మదన్‌గోపాల్, శేఖర్ తదితరులున్నారు.

నృసింహస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు

రుద్రవరం, మే 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నరసాపురం, రుద్రవరం పరిధిలోని గుట్టకొండ, దొర్వి, నృసింహస్వామి క్షేత్రాల్లో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఆయా ఆలయాల్లో అర్చకులు అభిషేకం చేసి పూజలు ప్రారంభించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

పీఎం రిలీఫ్ ఫండ్‌కు చెక్కు అందజేత


కలెక్టర్ రాజకుమారికి చెక్కును అందిస్తున్న మహేష్‌కన్నా

డోన్ టౌన్, మే 10 (ఆంధ్రజ్యోతి): పీఎం రిలీఫ్ ఫండ్‌కు ప్రముఖ పారిశ్రామికవేత్త మహేష్ కన్నా విరాళం అందజేశారు. శనివారం డోన్ పర్యటనకు వచ్చిన కలెక్టర్ రాజకుమారిని కలిసి పీఎం ఫండ్‌కు రూ.11వేలు, సత్యసాయి జిల్లా జవాన్ మురళీనాయక్ కుటుంబానికి రూ.11వేలు, సయ్యద్ ఆదిల్ హుశేన్ కుటుంబానికి రూ.11వేలు చెక్కును అందజేశారు.

నేడు మెగా రక్తదాన శిబిరం

బేతంచెర్ల, మే 10 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మాతృ దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలో లైఫ్ యువనేత్ర సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు సభ్యుడు విజయ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. శేషారెడ్డి ఉన్నత పాఠశాలలో గాండ్ల రమేష్ కుమార్ ఆర్థిక సహకారంతో శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. శిబిరాన్ని విజయవంతం చేసేందుకు యువత రక్తదానం చేయాలని కోరారు.

వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ


ధ్వజస్తంభ ప్రతిష్ఠలో పాల్గొన్న గ్రామస్థులు

బేతంచెర్ల, మే 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొలుములపల్లె గ్రామంలో వెలసిన పురాతన ఆంజనేయస్వామి ఆలయం వద్ద శనివారం ధ్వజస్తంభ ప్రతిష్ఠ వైభవంగా నిర్వహించారు. అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు ఉన్నం చంద్రశేఖర్, పోలూరు శ్రీనివాసరెడ్డి, శివప్రసాద్, సామే తిమ్మయ్య, చంద్ర, కిట్టు, భక్తులు పాల్గొన్నారు.

నాటుసారా స్వాధీనం

బనగానపల్లె, మే 10 (ఆంధ్రజ్యోతి): బన గానపల్లె, నంద్యాల ఎక్సైజ్ స్పెషల్ స్క్వాడ్‌లు కొలిమిగుండ్ల మండలంలో 100 లీటర్ల నాటుసారా పాకెట్లను శనివారం స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు. రామ్‌కో సిమెంట్ ఫ్యాక్టరీ వద్ద 50 లీటర్ల, అవుకు మండలం రామాపురంలో 50 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకునానమన్నారు. నవోదయం 2.0లో భాగంగా ఈ దాడులు ఏఈఎస్ రాముడు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇరువురిపై కేసులు నమోదు చేసినట్లు ఎక్సైజ్ ఎస్‌ఐ కరుణాకర్ పాల్గొన్నారు.